RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY    తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి | సంపుటి : 3 | సంచిక : 177 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ | ఆదివారం, జనవరి, 4, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/-
MALKAJGIRI | VOLUME : 3 | ISSUE NO : 177 | EDITOR : MERUGU CHANDRAMOHAN | Sunday, January, 4, 2026 | PAGES : 8 RS : 4 /-



## హై డోస్ తీసుకుంటున్నా..

### తన ఆరోగ్యంపై స్పందించిన ట్రంప్

వాషింగ్టన్: తన ఆరోగ్యంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతం తాను పూర్తి ఆరోగ్యంతో ఉన్నానని స్పష్టం చేశారు. అయితే వైద్యులు సూచించిన మోతాదుకన్నా ఎక్కువగా తాను ఆస్పిరిన్ తీసుకుంటున్నానని తెలిపారు. వాల్‌స్ట్రీట్ జర్నల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయాలు పంచుకున్నారు. ట్రంప్ ఆరోగ్యంపై గతంలో సోషల్ మీడియాలో అనేక పుకార్లు షికారు చేశాయి. కొంతకాలం ఆయన బహిరంగంగా కనిపించకపోవడం, కార్యక్రమాల్లో పాల్గొనకపోవడంతో 'ట్రంప్ మిస్సింగ్' అంటూ ప్రచారం కూడా చేశారు. అలాగే ఆయన చేతులు, కాళ్లపై గాయాలు కనిపించడంతో వాటిని కవర్ చేసేందుకు మేకప్ వేసుకున్న ఫొటోలు వైరల్‌అయ్యాయి. దీనిపై అప్పట్లో స్పందించిన ట్రంప్, తన జీవితంలో ఇప్పటి వరకు ఇంత ఆరోగ్యంగా ఎప్పుడూ లేనని చెప్పడంతో ఆ పుకార్లకు తెరపడింది. తాజాగా ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఆరోగ్యంపై ట్రంప్ మాట్లాడుతూ గత 25ఏళ్లుగా తాను ఆస్పిరిన్ టాబ్లెట్లు తీసుకుంటున్నానని, అయితే,డాక్టర్లు రోజుకు81మిల్లీగ్రాములు సూచిస్తే తాను మాత్రం 325మిల్లీగ్రాములు తీసుకు ంటున్నానని తెలిపారు. రక్తాన్ని పలుచగా ఉంచడంలో ఇది ఎంతో దోహదపడు తుందన్నారు. తన గుండెలో చిక్కటి రక్తం ప్రవహిం చడం తనకు ఇష్టం లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఇటీవల వైట్‌హౌస్‌లో జరిగిన కార్యక్రమాల్లో తాను వినికిడి సమస్యలు ఎదుర్కొంటున్నానని, తరచూ నిద్రపోతున్నానని వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని ఆయన ఖండించారు.

## ఛత్తీస్‌గడ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్

### ఎదురు కాల్పుల్లో 12మంది నక్సల్స్ హతం

రాయపూర్, జనవరి3 : ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. శనివారం మావోయిస్టులకు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 12 మంది మావోయిస్టులు తమ ప్రాణాలు కోల్పోయా రని పోలీసులు వెల్లడించారు. మృతుల్లో కొంటా ఏరియా కమిటీ కార్యదర్శి మంగడు ఉన్నారు. ఘటనా స్థలం నుంచి ఏకే-47, ఇన్సాస్ రైఫిల్స్, ఇతర ఆయుధాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మరో ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మృతి చెందారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కిష్టారం పోలీసు స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం సుక్మా జిల్లా రిజర్వ్ గార్డ్ సెర్చ్ ఆపరేషన్‌ను ప్రారంభించింది. ఈ క్రమంలో పామ్లూరు గ్రామం సమీపంలో ఇరువర్గాల మధ్య ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఈ ఘటనలో మొత్తం 12 మంది మావో యిస్టులు ప్రాణాలు కోల్పోగా.. మంగడు మినహా మిగతా వారి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.






## పేదలకు అండగా నిలవడమే సర్కార్ లక్ష్యం

### అర్హులందరికీ గృహ జ్యోతి పథకం వర్తింపు
### అసెంబ్లీలో డిప్యూటీ సిఎం భట్టి వెల్లడి

హైదరాబాద్,తెలంగాణ దిశ : పేద, బడుగు వర్గాలు ఆత్మగౌరవంతో జీవిం చడమే ప్రభుత్వ లక్ష్యమని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క తేల్చిచెప్పారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా అర్హు లందరికీ గృహ జ్యోతి వర్తిస్తుంద న్నారు. తెలంగాణ అసెంబ్లీలో ప్రశ్నో త్తరాల సమయంలో రాష్ట్రంలోని వివి ధ అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్న లకు మంత్రులు సమాధానాలు ఇచ్చా రు. ప్రధానంగా గృహ జ్యోతి పథకం, ఇంద్రమ్మ ఇళ్లు, వ్యవసాయ పథకాలు, సోయా కొనుగోలు వంటి ముఖ్య సమస్యలపై చర్చలు జరిగాయి. ముందుగా గృహ జ్యోతిపై ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, ఆది శ్రీనివాస్, నాగరాజు పలు ప్రశ్నలు సంధిం చారు. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఉ పముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. 200 యూని ట్ల వరకు ఉచిత విద్యుత్ గృహ జ్యోతి పథకం కొనసాగింపుపై సభలో డిప్యూటీ సీఎం స్పష్టతనిచ్చారు.కొత్త దరఖా స్తులు, మార్పులు ? చేర్పులకు ప్రజా పాలన కార్యాలయాల్లో అవకాశం ఉ ందని చెప్పారు.



## మోదీపై కూనంనేని వ్యాఖ్యలు.. తీవ్రంగా స్పందించిన కిషన్ రెడ్డి

- వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకరమని వ్యాఖ్య
- అంతర్జాతీయస్థాయిలో దేశం గౌరవాన్ని పెంచుతున్న నాయకుడు మోదీ అన్న కిషన్ రెడ్డి
- ప్రధానిపై కూనంనేని అభ్యంతరకర వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్న కిషన్ రెడ్డి

హైదరాబాద్,తెలంగాణ దిశ: రాజకీయాల్లో హుందాతనం, పరిణతి అవసర మని, కానీ ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వ్యక్తిగత దూషణలు, అర్థంలేని ఆరోపణలు చేయడం దురదృష్టకర మని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ప్రధానిపై ఆయన చేసిన వ్యాఖ్యలు హేయ మైనవని అన్నారు. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికై, దేశాభివృద్ధికి అహోరాత్రులు శ్రమిస్తూ, అంతర్జాతీయస్థాయిలో భారతదేశ గౌరవాన్ని పెంచుతున్న నాయకుడు మోదీ అని కొనియా డారు. అలాంటి ప్రధానిపై కూనంనేని అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నానని కిషన్ రెడ్డి అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ దివాలాకోరుతనాన్ని బయట పెట్టాయని విమర్శించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. కూనంనేని వంటి వారు చేస్తున్న వ్యాఖ్యలతో ప్రజాస్వామ్య విలువలపై, రాజకీయ వ్యవస్థపై ఏవగింపు కలుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాని మోదీపై కూనంనేని సాంబశివరావు చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు.




## ఉదయం వేళ కనిపించని రహదారి..!

### చీకటిగా మారిన ఉదయం

కమాన్ పూర్,తెలంగాణ దిశ : గ్రామాలని పొగ మంచుతో కమ్ముకొని చీకటిగా మారాయి. నిప్రధాన రహదారుల్లో వాహనదారులు వెళ్లాలంటే లైట్లు వేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఎటు చూసినా ఒక మంచు కప్పుకొని చీకట్ల ఏర్పడింది.ని సీతాకాలంలో ఒక వైపు చల్లటి గాలుల తీవ్రతను ప్రజలు చవిచూస్తున్న నేపద్యంలో, ప్రజలు చలి కి గజ గజ వణికి పోతున్నారు.

పలువురు రాత్రి వేళ ఇండ్ల ముందు మంటలు వేసు కొని చలి కాగుతున్నారు. దీనికి తోడు రెండు రోజులుగా పొగమంచు తీవ్రత చూపుతుండడంతో ఉదయం 8 గంటల వరకు కూడా రహదా రులు, గృహాలు పొగ మంచుతో కప్పి వేస్తుండడం తో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.



## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

- గత పదేళ్లలో ఇళ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి

హైదరాబాద్,తెలంగాణ దిశ : గత బిఆర్ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు చెల్లించిన బిల్లులలో అవకతవ కలు జరిగినట్లు ఆరోపణలు వచ్చాయని, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై అసెంబ్లీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అన్నారు. ప్రస్తుతం విచారణ జరుగుతో ందని, విచారణ పూర్తయిన తర్వాత పెండింగ్ బిల్లులను చెల్లిస్తా మని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల సమస్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో విమ ర్శలుచేశారు. తమ నియోజకవర్గాల్లో బిల్లులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు త్వరగా చెల్లించాలని, టెక్నికల్ సమస్యలతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



## సిద్ధప్పకు కొత్త సెగ

బెంగళూరు, జనవరి 3, : కర్ణాటక రాజధానిలో యలహంక సమీపంలోని కోగిలు లేఅవుట్ కూల్చివేతలు ఇప్పుడు రాజకీయ రణరంగంగా మారింది. ప్రభుత్వ భూముల్లో దశాబ్దాలుగా వెలసిన ఆక్రమణలను తొలగించాలని ఒకవైపు కోర్టులు, పౌర సమాజం ఒత్తిడి తెస్తుంటే.. మరోవైపు అక్కడ నివసిస్తున్న భారీ ముస్లిం మైనారిటీ వర్గాల ఓటు బ్యాంకును కాపాడుకోవాల్సిన సంకట స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం చిక్కుకుంది.కోగిలు లేఅవుట్‌లో సుమారు 20-30 ఏళ్ల క్రితం ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మించిన వందలాది ఇళ్లను తొలగిం చడానికి అధికారులు సిద్ధమయ్యారు. అయితే, ఆక్రమణ దారులకు ప్రత్యామ్నాయ వసతి లేదా పునరా వాసం కల్పించాలన్న ప్రభుత్వ నిర్ణయం కొత్త వివాదానికి తెరలేపింది. అక్రమంగా భూమిని ఆక్రమించిన వారికి ప్రభుత్వ ఖర్చుతో ఇళ్లు కట్టించి ఇవ్వడం ఏంటని అన్ని వర్గాల నుంచి ప్రశ్నలు వస్తున్నా యి. ఆక్రమణదారుల్లో అధిక శాతం ముస్లింలు ఉన్నందుకే ప్రజాధనం ధారబోస్తున్నారని..



## పత్తి రైతులకు షాక్

అదిలాబాద్,తెలంగాణ దిశ : తెలంగా ణలో పత్తి సాగుకు పురిటిగడ్డగా పేరొందిన ఆదిలాబాద్ జిల్లాలో పత్తి రైతులు ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో మునిగిపోయారు. కాటన్ కార్పొరేష న్ ఆఫ్ఇండియాతాజాగాపత్తి కొను గోలు ధరలను తగ్గిస్తూ తీసుకు న్న నిర్ణయం అన్నదాతల పాలిట పిడు గులామారింది. నాణ్యత సాకుతో ఇప్పటికే ఇబ్బందులు పెడుతున్న అధికారులు.. ఇప్పుడు క్వింటాల్ పత్తి ధరపై ఏకంగా యాభై రూపా యలు కోతవిధించారు. దీంతో కొత్త ధర 8వేల50రూపాయలుగా నిర్ణ యించా రు.సిసిఐ అధికారులు ఈ ధర తగ్గిం పుకు విచిత్రమైన కారణాల నుచూపు తున్నారు.పత్తిలోఉండే పిం జా పొడవు తక్కువగా ఉందని.. అం దుకే నాణ్య త లేని పత్తి గా పరిగ ణి ంచిధరతగ్గిం చామని చెబుతున్నారు.

# రాష్ట్రపతి నిలయంలో 'ఉద్యాన్ ఉత్సవ్ 2026' ప్రారంభం







**బొల్లారం, జనవరి 03, (తెలంగాణ దిశ) :**'ప్రజా భాగస్వామ్యం, సుస్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించనున్న ఉద్యాన్ ఉత్సవ్ 2026ను భారత రాష్ట్రపతి శీతాకాల విడిది కేంద్రమైన రాష్ట్రపతి నిలయంలో 2026 జనవరి 3 నుంచి జనవరి 11 వరకు జరగనుంది. పర్యావరణ అవగాహన, ప్రజా భాగస్వామ్యాన్ని ప్రోత్సహించేందుకు చర్యల్లో భాగంగా ఈ రెండవ విడత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు . వ్యవసాయంలో పెరుగుతున్న మహిళల నాయకత్వానికి ప్రతీకగా సీహెచ్. సృజన, కోసిరెడ్డి లావణ్య రమణారెడ్డి అనే ఇద్దరు అభ్యుదయ మహిళా రైతులు ఈ ఉత్సవాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి 'మేనేజ్' డైరెక్టర్ జనరల్ ఐపీఓఎస్ డాక్టర్ సాగర్ హనుమాన్ సింగ్, రాష్ట్రపతి భవన్ ప్రజా సంబంధాల అధికారి కుమార్ సమరేష్, రాష్ట్రపతి కార్యాలయం అధికారి డాక్టర్ కె. రజనీ ప్రియ, 'మేనేజ్' డైరెక్టర్ డాక్టర్ శాలేంద్ర హాజరయ్యారు. 'మేనేజ్' సహకారంతో వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ నేతృత్వంలో రాష్ట్రపతి ప్రాంగణాలను ప్రజా భాగస్వామ్యం, పర్యావరణ స్పృహకు శక్తిమంతమైన కేంద్రాలుగా మార్చాలనే గౌరవనీయులైన భారత రాష్ట్రపతి దార్శనికతకు అనుగుణంగా 'ఉద్యాన్ ఉత్సవ్ 2026' నిర్వహిస్తున్నారు.

వ్యవసాయ ఆవిష్కరణలు, వ్యవస్థాపకత, విలువ జోడింపు కోసం ఒక సమగ్ర వేదికను అందిస్తూ సుమారు 120 మంది ప్రదర్శనకారులతో కూడిన 50 థిమాటిక్ స్టాల్స్ ఈ ఉత్సవంలో ఉన్నాయి. 59 రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పీఓ) ఉత్పత్తులతో ప్రజలను నేరుగా అనుసంధానించే 'ఫామ్-టు-ఎంటర్‌ప్రైజ్ జోన్'.. నర్సరీ మొక్కలు, జీవ ముడి పదార్థాలను అందించే 'ప్లాంట్ అండ్ ప్రొడ్యూస్ జోన్'.. గిరిజన హస్తకళలు, జీఐ-ట్యాగ్ ఉన్న ఉత్పత్తులు- సేంద్రీయ ఉత్పత్తులను ప్రదర్శించే 'ఎకో బజార్', పోషక విలువలు గల ఉత్పత్తులను ప్రోత్సహించే 'మిల్లెట్ మండి, అంకుర హబ్'..

అధునాతన వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించే 'హరిత విజ్ఞాన కేంద్రం' వంటివి ఇక్కడి ప్రధాన ఆకర్షణలుగా ఉన్నాయి. వచ్చే తొమ్మిది రోజులు (2026 జనవరి 3-11) ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉద్యాన్ ఉత్సవ్- 2026ను ప్రజలు ఉచితంగా సందర్శించవచ్చు. ఇక్కడ అన్ని ప్రాంతాల నుంచి పాఠశాల విద్యార్థులు, ప్రజలు, అభ్యుదయ రైతులు, ఇతర భాగస్వాములు ప్రారంభోత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## సర్పంచ్ గా ఎన్నికైన మల్లారెడ్డికి ట్రస్మా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం



**చౌటుప్పల్, జనవరి 03, (తెలంగాణ దిశ) :** చౌటుప్పల్ మల్లికార్జున స్కూల్ కరస్పాండెంట్ మారేపల్లి మల్లారెడ్డి ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో కొమ్మాయిగూడెం సర్పంచ్ గాఎన్నికైనసందర్భంగా ట్రస్మా నాయకులుశనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు పాలకుర్ల వెంకటేశం మాట్లాడుతూఎందరో విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దిన మల్లారెడ్డి ప్రస్తుతంగ్రామసర్పంచ్‌గా గ్రామాన్ని తీర్చిదిద్దవలసిన అవకాశం దొరికిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ట్రస్మా ఉపాధ్యక్షులు కృష్ణారావు, జిల్లా నాయకులు గురునాథపల్లి మల్లేశం, మండల అధ్యక్షులు కృష్ణంరాజు,ఎండి. సయ్యిద్ షమీమ్, శ్రీనివాస్,ట్రినిటీ స్కూల్ ప్రిన్సిపాల్ మంజుల, గోదాదేవి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ల జాబితా మ్యాపింగ్ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలి..



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జనవరి 03, (తెలంగాణ దిశ) :**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా 2002 నుండి ఉన్న ఓటరు జాబితాను 2025 ఓటరు జాబితాకు అనుగుణంగా సవరించే మ్యాపింగ్ ప్రక్రియను నిర్దేశిత గడువులోగా 70 శాతం పూర్తి చేయాలని ఎఆర్ఓ, ఈఆర్ఓలను తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్లతో సచివాలయం నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడుతూ ఈ మ్యాపింగ్ ప్రక్రియలో రోజుకు బిఎల్ఓలకు 30 నుండి 40 లక్ష్యాలు, సూపర్ వైజర్లకు 300 నుండి 400, ఎఈఆర్ఓలకు 3000 నుండి 4000, ఈఆర్ఓలకు 30 వేల నుండి 40 వేల వరకు లక్ష్యాలను పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిఎల్ఓలతో ఇంటింటికి వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలన చేయాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ మ్యాపింగ్ ప్రక్రియలో క్షేత్రస్థాయి పరిశీలన చేయాలని సూచించారు. అదే విధంగా ఈ ప్రక్రియను పకడ్బందీగా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన చోట రాజకీయ పార్టీల నుండి అదనపు సిబ్బందిని, కంప్యూటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక నియోజకవర్గం నుండి





ఈఆర్ఓలతో మ్యాపింగ్ ప్రక్రియ ఏవిధంగా జరుగుతుందని, ఇందులో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏ విధమైన సహాయ సలహాలకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం అన్నివేళల్లా అందుబాటులో ఉంటుందని అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నుంచి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పాల్గొని ప్రధాన ఎన్నికల అధికారి సూచనలను తప్పకుండా పాటించి లక్ష్యాలను పూర్తి చేస్తామన్నారు.

## విజయ హైస్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన





**కాప్రా, జనవరి 03, (తెలంగాణ దిశ) :**విజయ హైస్కూల్ లో శనివారం రోడ్డు భద్రత, ట్రాఫిక్ భద్రత అవగాహన ర్యాలీ నిర్వహించారు. జనవరి నెలలో అన్ని పాఠశాలల్లో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని రవాణా, బీసీ సంక్షేమ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు రోడ్డు భద్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణా విద్యాశాఖ డైరెక్టర్ కె. లింగయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ్ కుమారీ సహకారంతో అలాగే కుషాయిగూడ పోలీస్ స్టేషన్ అధికారుల సూచనలతో విజయవంతంగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విజయ హైస్కూల్ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు కూడా చురుకుగా పాల్గొన్నారు. విద్యార్థులు ప్లకార్డులు, చార్టులు ప్రదర్శిస్తూ రోడ్డు భద్రతకు సంబంధించిన నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నియమాల పాటింపు, పాదచారుల భద్రత, రోడ్లపై బాధ్యతాయుత ప్రవర్తన అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కొప్పునూరి రాజేశ్వర్, ప్రిన్సిపల్ దేవినేని వెంగబాబు రోడ్డు భద్రత యొక్క ప్రాముఖ్యతపై మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరం, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, అలాగే విద్యార్థులు సమాజంలో అవగాహన దూతలుగా మారాలని వారు పేర్కొన్నారు.



## సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా మహిళా ఉపాధ్యాయులకు సన్మానం






**కాప్రా, జనవరి 03, (తెలంగాణ దిశ) :**కాప్రా గాంధీనగర్ మండల పరిషత్ అప్పర్ ప్రైమరీ స్కూల్ హెచ్‌డబ్ల్యూలో సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బత్తుల శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా విద్యాభివృద్ధికి సావిత్రీబాయి పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. ఆమె చూపిన మార్గంలో నేటి ఉపాధ్యాయులు విద్యార్థులను తీర్చిదిద్దాలని అన్నారు. మహిళా ఉపాధ్యాయులు విద్యతో పాటు విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాలరాజు, రాఘవేందర్ గౌడ్, వేణుమాధవ్, విద్యార్థులు పాల్గొని సావిత్రీబాయి పూలే చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాళ్లు మంజుల, రమ, సాయి లక్ష్మీలను శాలువాలతో సత్కరించారు.

## కన్నుల పండువగా శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం





**కాప్రా, జనవరి 03, (తెలంగాణ దిశ) :**కాప్రా డివిజన్ పరిధిలోని తిరుమల శివపురి కాలనీ విల్లా నెంబర్ 73లో శనివారం శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి వార్ల కళ్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎ శంకర్ కాలనీ వైస్ ప్రెసిడెంట్, జేఏసీ కాప్రా డివిజన్ కన్వీనర్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కాప్రా డివిజన్ అధ్యక్షుడు బైరి నవీన్ గౌడ్, నల్ల రాధాకృష్ణ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, భక్తులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పోలీసుల వాహనాల తనిఖీ.., సరైన పత్రాలు లేని 15 వాహనాలు స్వాధీనం





**కుషాయిగూడ, జనవరి 03, (తెలంగాణా దిశ) :**కుషాయిగూడ, నేరేడ్‌మెట్ పోలీసులు శనివారం సైనిక్ పురి చౌరస్తాలో సంయుక్తంగా విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 25మంది పోలీసులు పాల్గొన్నారు. పోలీసులు వాహనదారుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఇందులో భాగంగా సరైన పత్రాలు లేని 15 వాహనాలను గుర్తించారు. నిబంధనలు పాటించని వాహనా లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రజలు తప్పని సరిగా వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు కలిగి ఉండాలని పోలీసులు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఇటువంటి తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని తెలిపారు.

## హోంగార్డుల సమస్యలను పరిష్కరించాలి : పట్నం మహేందర్ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 03, (తెలంగాణ దిశ) :** ప్రభుత్వం హోం గార్డుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి కోరారు. చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అధ్యక్షతన శాసన మండలి 25వ సమావేశాల మూడవ రోజు శనివారం ప్రశ్నోత్తరాల సమయం తరువాత సాగిన ప్రత్యేక ప్రస్తావనలో ఆయన హోం గార్డుల సమస్యలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 14 వేల మంది హోంగా ర్డులు పోలీస్ శాఖలో పనిచేస్తున్నారని చెప్పారు. పోలీస్ శాఖలోని ఉన్నతాధికారులు మొదలు కానిస్టేబుల్ వరకు ఉద్యోగులతో కలిసి వారు అనునిత్యం శాంతి భద్రతల కోసం తపిస్తూ విధులను నిర్వహిస్తుంటారని చెప్పారు. అసలు పోలీసు శాఖలో ముందుండి పని చేసేది హోంగార్డులేనని ఆయన అన్నారు. ఇలా కష్టపడే హోంగార్డులు వేతనాలతో పాటు ప్రభుత్వం ద్వారా అందే ఇతర సదుపాయాల కోసం ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చివరకు వారి కుటుంబంలో ఎవరైనా చనిపోతే ఆ పరిస్థితిలో సైతం వారు కష్టపడుతుంటే పట్టించుకునే వారు కరువైనట్లు వాళ్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో వారికి ఉన్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరి ంచాలని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ద్వారా కోరుతున్నట్లు ఆయన వివరించారు. ఇందుకు స్పందించిన రాష్ట్ర మంత్రి హజరుద్దీన్ హోం గార్డుల సమస్యలను పరిష్కరిస్తామని, అందుకు సీఎంకు నివేదిస్తానని హామీ ఇచ్చారు.

## ఘనంగా టిడిపి నాయకురాలు ఆశా బిందు జన్మదిన వేడుకలు

**నాగారం, జనవరి 03, (తెలంగాణ దిశ) :**టిడిపి నాయకురాలు ఆశా బిందు జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అభిమానులు, పార్టీ నాయకులు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి నాయకులు విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వరి దేవస్థాన కమిటీ సభ్యులు తాలికోట హరికృష్ణ సతీమణి, టిడిపి సీనియర్ నాయకురాలు ఆశాబిందు పుట్టినరోజు సందర్భంగా ఆమెకు పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగారం టిడిపి నాయకులు ఉమాశంకర్ గౌడ్, మరీదు ఆంజనేయ వరప్రసాద్ గౌడ్, శివాజీ, నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



## జగన్ నేతలకు అల్టిమేటం జారీ చేశారా...

విజయవాడ: వైసీపీ అధినేత జగన్ పార్టీనేతలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదనిపిస్తుంది. ఎవరికి వారే నిర్ణయాలు ప్రకటించడం ఇప్పుడు పార్టీలోనే కాదు రాజకీయంగా కూడా చర్చనీయాంశమైంది. ప్రాంతీయ పార్టీ అంటే అధినేత ఆలోచనలను పసిగట్టి నేతలు మసులుకోవాల్సి ఉంటుంది. అయితే కొందరు నేతలు కట్టు తప్పుతున్నారని పార్టీ వర్గాలే అభిప్రాయపడుతున్నాయి. జగన్ ఆలోచనల ప్రకారం నేతలు నడుచుకోవడం లేదనడానికి ఇటీవల జరిగిన అనేక ఘటనలు ఇందుకు ఉదాహరణగా చూపుతున్నారు. జగన్ ఆంధ్రప్రదేశ్ కు దూరంగా ఉండటంతో పాటు నేతలతో తరచూ సమావేశాలు కాకపోవడం వల్లనే ఈ రకమైన ఇబ్బందులు పార్టీలో తలెత్తుతున్నాయన్నది వాస్తవం. అందుకే ఆయన కనిపించరట 2019 ఎన్నికలకు ముందు...

2019 ఎన్నికలకు ముందు.. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్ మాట వేదవాక్కుగా నడిచేది. ఏ నిర్ణయమైనా అంతసులువుగా బయటకు చెప్పే వారు కాదు. కేవలం సజ్జల రామకృష్ణారెడ్డి మాత్రమే జగన్ తో మాట్లాడి వచ్చిన తర్వాత పార్టీ, ప్రభుత్వ ఆలోచనను ప్రజల ముందుంచేవారు.

# సంపాదకీయం

## వరద సహాయక చర్యల్లో వైఫల్యం !

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, అజారుద్దీన్‌కు మంత్రి పదవి..ఈ రెండే కాంగ్రెస్ ప్రభుత్వ ఎజెండాలో ఉన్నాయా అన్న అనుమానం కలుగుతోంది. మెంథా తుఫాన్‌తో రాష్ట్రం విలవిల్లాడినా, వరంగల్ నగరం మునిగి ప్రజలంతా నీటి పాలయినా ఎక్కడా సహాయక చర్యలు సక్రమంగా లేవు. రెండు రోజులపాటు, ఇల్లూ వాకిలి వదిలి వెళ్లిన ప్రజలు ఇంటికి వచ్చే వరకు సర్వం కొట్టుకు పోయింది. అయినా వారి ఇళ్లను శుభ్రం చేసు కోవాలంటే నీరు లేదు. తాగడానికి నీళ్లు లేవు. భోజనం సంతగి వేరుగా చెప్పాల్సిన పనిలేదు. ఉన్నదంతా ఊడ్చుకుపోయినా వారిని ఆదుకునేందుకు ఎవ్వరూ కానరాలేదు. గోపాలపురం, భీమారం పరిధిలోని కాలనీ ప్రజల వ్యథ అంతాఇంతా కాదు. ఎపిలో సిఎం చంద్రబాబు, ఆయన మంత్రులు, అధికారులు నిముష నిముషానికి సమీక్షించి ప్రజలకు అండగా నిలిచారు. తుపాన్ తీరం దాటిన తెలలవారే చంద్రబాబు బాధజత ప్రాంతాల్లో పర్యటించారు. మంత్రులు పర్యటించారు. కానీ ఓరుగల్లులో అలాంటి పరిస్తితి కానరాలేదు. తెలంగాణలో మాత్రం అలాలేదు. మంత్రులు అందరూ జూబ్లీహిల్స్‌లో ఊరేగితే రాష్ట్రంలో పాలన పరిస్థితి, ప్రజల పరిస్థితి ఏంటని వరంగల్ ముంపు ప్రాంతాలను చూస్తే అర్థం అవుతుంది. మంత్రులు కోరుకుంటే హెలికాప్టర్లు వస్తాయి.. ప్రజలు ఆపదలో ఉంటే మాత్రం రావా అని ప్రజలే నిలదీస్తున్నారు. హనుమకొండ, జులైవాడలో భారీగా కురిసిన వర్షానికి నీట మునిగిన కాలనీలతో పాటు అమరావతి నగర్, సమ్మయ్య నగర్, 100 ఫీట్ రోడ్డులో ఉధృతంగా ప్రవహిస్తున్న వరద ఉధృతిని పరిశీలించేందుకు మంత్రులు ఎవ్వరూ రాకపోవడం వింతే. మొంథా వరద బీభత్సంతో గ్రేటర్ వరంగల్ పరిధిలోని అనేక కాలనీలు నీటి మునిగి, నగరం జల దిగ్బంధం అయింది. నిత్యావసర వస్తువులు సహా, విలువైన టీవీ, బీరువాలు సైతం నీట మిగిని ఆస్తి నష్టం వాటిల్లింది. వృద్ధులు, వికలాంగులు, బాలింతలు రాత్రంతా నీటమునిగిన ఇళ్లల్లోనే గడిపారు. తుఫాన్ తీవ్రతను ముందస్తుగా గ్రహించి అంచనా వేయడంలో, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం లో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. తక్షణమే నీటి మునిగిన ప్రాంతాల్లో ఆస్తి నష్టం అంచనా వేసి నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది.సమ్మయ్య నగర్ పూర్తిగా నీట మునిగి ప్రజలు సర్వం కోల్పోవడం జరిగింది. ఆవులు, గేదెలు, పశువులు అరుస్తూ వరదల్లో కొట్టుకుపోవడం వాటి యజమానులను కలిచి వేసింది. ఆస్తి నష్టంతో పాటు పశు పక్షాదుల ప్రాణ నష్టం కూడా భారీగా వాటిల్లే ప్రమాదం ఉంది. మొంథా తుఫాన్ దూసుకొస్తుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసినాముందస్తు చర్యలు తీసుకోవడంల ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. ఈ సమయంలో ఒక్క జిల్లాకు ఒక్కో మంత్రి ఇంచార్జ్‌గా ఉండి.. వరద ప్రాంత ప్రజలకు రక్షణగా ఉండాలి. ఇన్‌ఛార్జ్ మంత్రిగా ఉన్న వారితో సహా జిల్లాలకు చెందిన మంత్రులు కూడా పెద్దగా ప్రభావం చూపలేదు. లోతట్టు ప్రాంతాల ప్రజల జీవనం కూడా దుర్భరంగా మారింది. శివనగర్, మైసయ్య నగర్, ఆర్ఎస్ నగర్, చింతల్ ప్రాంతాల్లోని అనేక కాలనీలు పూర్తిగా జలమయమయ్యాయి. ముఖ్యంగా శివనగర్ మరియు మైసయ్య నగర్లలోని ఇళ్లలోకి వరద నీరు భారీగా చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇండ్లలోని గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు అన్నీ నీటిలో తడిచి ముద్దయ్యాయి. రాత్రంతా నిద్రలేని రాత్రులు గడిపి, ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. వరద బాధితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు శివనగర్‌లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల్లో బల్దియా పారిశుధ్య కార్మికులు సహాయ కార్యక్రమాలు చేపట్టారు. రోడ్లమీద, డ్రైనేజీ, నాలాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఇకపోతే భారీ వర్షాలు, వరదలతో భీభత్సం సృష్టించిన మొంథా తుఫాన్ అన్నదాతల ఆశలపై పిడుగు పాటుగా మారింది. చేతికొచ్చిన పంటలు నేలపాలు కావడంతో ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు. కేవలం పంటలే కాక, లోతట్టు ప్రాంతాల ప్రజల జీవితాలు కూడా వరదనీటిలో చిక్కుకుపోయాయి. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 17వ డివిజన్‌లోని విలీన గ్రామాల రైతులను తుఫాన్ నిండా ముంచింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట పొలాలన్నీ చెరువులను తలపిస్తూ పూర్తిగా నేలకొరిగాయి. అలాగే, ఖిలా వరంగల్‌లో పరిస్థితి మరింత దారుణంగా మారింది. వందల ఎకరాల్లో పండించిన ఆకుకూరలు, కూరగాయల తోటలు ఏకంగా 6 అడుగుల నీటి కింద మునిగిపోయాయి. కోట ప్రాంతంలో రైతులు తమ సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డారు. కళ్ల ముందు పంట నాశనం కావడంతో, వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కష్టపడి సాగు చేసిన పంట వారం రోజుల్లో చేతికి వస్తది అనుకున్న అన్నదాతల ఆశ ఆడియోసలైంది. మొత్తం తుఫాన్‌కు ఆహుతి కావడంతో, ఆపదలో ఉన్న తమను ఆదుకోవాలని, కనీసం పెట్టుబడికైనా సాయం చేయాలని వారు కోరుకుంటున్నారు. ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు. పరిస్థితి ఇలా ఉంటే శుక్రవారం వరంగల్ పర్యటనకు సిఎం రేవంత్ రెడ్డి వస్తున్నారు. అయితే మంత్రులు ఇటుపై దృష్టి పెట్టి ముందస్తు హెచ్చరికలు చేసివుంటే..ప్రజలను సరుక్షిత ప్రాంతాలకు తరలించివుంటే నష్టం తగ్గించగలిగే వారు. ఇప్పటికైనా ఆప న్నులను ఆదుకోవాలి. సర్వం కోల్పోయిన వారికి వంటసామాన్లు సహా అన్ని కొని ఇవ్వాలి. రైతులను ఆదుకోవాలి.తడిసిన ధన్యం వెంటనే కొనుగోలు చేయాలి.

# విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా...

## - ఎంపీ ఈటల రాజేందర్








**కుషాయిగూడ, జనవరి 03, (తెలంగాణ దిశ) :** కేంద్ర ప్రభుత్వం రంగ సంస్థల విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ హామీ ఇచ్చారు. శనివారం ఈసీఐఎల్ చౌరస్తాలోని డాక్టర్ హోమీ జె బాబా కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఎన్ఎఫ్ సీ, డిఏఈ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆవిర్భావ సభకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రైవేట్ రంగా ఉద్యోగుల కంటే ప్రభుత్వ రంగ ఉద్యోగులకే అనేక సదుపాయాలు ఉన్నాయన్నారు ప్రభుత్వ రంగంలో సంస్థలను నెలకొల్పవలసిన అవసరం ఉందని చెప్పారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ దేశ సేవలో కీలక పాత్ర పోషించి పదవీ విరమణ చేసిన ఉద్యోగుల సంక్షేమం కోసం ఇలాంటి సంఘాలు ఏర్పడటం అభినందనీయమని అన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల అనుభవం సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విశ్రాంత ఉద్యోగుల సమస్యలపరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. ముఖ్యంగా ఆరోగ్య సమ స్యలు ఉంటే వైద్య సదుపాయాల కోసం తనను సంప్రదించవచ్చునని సూచించారు. అసోసియేషన్ అధ్యక్షులు ఎం. నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ఎంబీ. సంపత్ కుమార్ మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ అసోసియేషన్ ఏర్పాటు యాజమాన్యానికి వ్యతిరేకం కాదని, కేవలం విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసమే ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలోమాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్ రెడ్డి,మాజీ ఎంబీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, బిజెపి నాయకులు మర్రి మోహన్ రెడ్డి, ఐజిసిఏఆర్ విశ్రాంత డైరెక్టర్ ఎస్. గోవర్ధన్ రావు, హెడ్ మెడికల్ డివిజన్ ఎన్ఎఫ్ సి విశ్రాంత ఉద్యోగి డాక్టర్ వి జయరావు, రిటైర్ సైంటిఫిక్ ఆఫీసర్ ఆర్.బి యాదవ్, రిటైర్డ్ సీఎవో డాక్టర్ ఆర్. మురుగయ్య, విశ్రాంత ఐఎఫ్ఎ సిహెచ్. నరసింహ చారి, రిటైర్డ్ సిఏఓ ఏఎస్. లక్ష్మణరావు, అణు ఇందన సంస్థ రిటైర్డ్ జనరల్ మేనేజర్ వై. బాలాజీ రావు, అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.చంద్రశేఖర్,ఉపాధ్యక్షులు కేపీ సావంట్, ఎ.విజయానంద్, ఎంబి. విజయకుమార్, సంయుక్త కార్యదర్శులు జిఎస్ వివిఎస్ ఎన్. మూర్తి, కొత్త అంజిరెడ్డి,ఆర్గనైజింగ్ సెక్రటరీ పద్మ నాగరాజు ఆర్. చంద్రశేఖర రావు,కోశాధికారి కె.రామచంద్రన్, కార్యవర్గ సభ్యులు వైవి. సుబ్బయ్య, మహమ్మద్ సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



# బల్క్ డ్రగ్ ఫ్యాక్టరీపై చెరో దారి!

**విజయనగరం,తెలంగాణ దిశ :**నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్క్ కు రాజకీయ రంగు పులుముకుంటుంది. 48 రోజులుగా బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేయొద్దు అంటూ రాజయ్యపేట మత్స్యకారులు తీవ్రస్థాయిలో ఆందోళన చేస్తుంటే పట్టించుకునే వారే కరువయ్యారు. ఎలాంటి రాజకీయ ప్రమేయం లేకుండా బతకడం కోసం మత్స్యకారులు బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా చేస్తున్న అలుపెరగని పోరాటానికి రాజకీయ పార్టీల మద్దతు కరువు అవుతోంది. అసలు నక్కపల్లి బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటులో రాజకీయ పార్టీల ప్రమేయం ఏంటి? రాజయ్యపేట పరిసరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేట సహా పరిసర గ్రామాల్లో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు శరవేగంగా జరుగుతున్నాయి. ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే ఏపీఐఐసీ రాజయ్యపేటలో 453 ఎకరాల భూమిని సమీకరించింది. ఆ భూమిని ప్రస్తుతం నిర్మాణానికి ఇవ్వడంతో వేగంగా పనులు జరుగుతున్నాయి. భూములను తీసుకున్న సమయంలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పలేదని, ఇతర పరిశ్రమల ఏర్పాటు మాత్రమే చేస్తామని చెప్పడంతో భూములు ఇచ్చామని, కానీ ఇప్పుడు ప్రాణాలు తీసే బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణం చేపట్టడాన్ని వ్యతిరేకిస్తూ 38 రోజులుగా రాజయ్యపేట గ్రామస్తులు ఆందోళన బాట పట్టారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణానికి అంగీకారం. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో బల్క్ డ్రగ్ పార్క్ నిర్మాణానికి అంగీకారం తెలిపారు.. ప్రభుత్వ మారడంతో అధికారంలోకి వచ్చిన కూటమి బల్క్ డ్రగ్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు పనులు కూడా వేగంగా జరిగేలాగా చర్యలు చేపట్టడంతో వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. పరిశ్రమల స్థాపన జరుగుతుండడంతో అసలు విషయం బయటపడింది. ఇప్పటికే హెటిరో డ్రగ్ పరిశ్రమ వల్ల సముద్రంలో కాలుష్యం పెరిగిపోయి, మత్స్య సంపద పూర్తిగా నాశనం అయిపోవడంతో పాటు, సముద్ర తీరంలో ఉన్న మత్స్యకార గ్రామాల్లోని ప్రజలు ఊపిరితిత్తులు క్యాన్సర్ లాంటి వ్యాధులతో బాధపడుతూ ప్రాణాలు కోల్పోతున్నామని బల్క్ డ్రగ్ పార్క్ వద్దని ఆందోళన చేయడం మొదలుపెట్టారు. రాజయ్యపేట మత్స్యకారుల ఆందోళన ఇప్పుడు రాజకీయ రంగు పులుముకుంది. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అనుమతులు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అన్ని అనుమతులు ఇవ్వడంతో పాటు ఫైల్స్ ని క్షణాల్లో క్లియర్ చేస్తుండడంతో వివిధ డ్రగ్ కంపెనీలు కార్యాలయాలతో పాటు పరిశ్రమల ఏర్పాటు కూడా చేసేస్తున్నాయి. పాయికరావుపేట నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న సిట్టింగ్ ఎమ్మెల్యే రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఆందోళన చేస్తున్న మత్స్యకారులతో మాట్లాడే ప్రయత్నం చేసిన విఫలమైంది. హోం మంత్రి వాహనాన్ని సైతం రాజయ్యపేట మత్స్యకారులు అడ్డుకున్నారు. అంతేకాకుండా జాతీయ రహదారిని నాలుగు గంటలకు పైగా దిగ్బంధించారు. జాతీయ రహదారి దిగ్బంధనం.

ప్రభుత్వంతోపాటు పోలీసులు కూడా రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న ఆందోళనను సీరియస్ గా తీసుకున్నారు . హోం మంత్రిని మత్స్యకారులు అడ్డుకున్న తర్వాత మళ్లీ మత్స్యకారులతో మాట్లాడే ప్రయత్నం చేయలేదు. జాతీయ రహదారిని దిగ్బంధించిన తర్వాత రాజయ్యపేట సహా 8 గ్రామాల్లో వేల మంది పోలీసులను కవాతు చేయిస్తూ మత్స్యకారులు భయం కలిగేలా చేస్తున్నారు అధికారులు. దీంతో మత్స్యకారులు చేస్తున్న బల్క్ డ్రగ్ పార్క్ వ్యతిరేక ఉద్యమం అధికార పార్టీ నుండి ప్రతిపక్షాల చేతుల్లోకి రోజురోజుకి వెళ్ళిపోతున్నట్లు కనిపిస్తుంది. ఆందోళనకు దిగి బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్. బీసీవై పార్టీ అధ్యక్షుడు రామచంద్ర యాదవ్, కమ్యూనిస్టుపార్టీల నాయకులు రాజయ్యపేట వెళ్లే ప్రయత్నం చేసినప్పుడు, పోలీసులు అడ్డుకోవడంతో ఆ ఉద్యమంలోకి వైసీపీ ఎంటర్ అయింది. నర్సీపట్నం మెడికల్ కాలేజీని పరిశీలించడానికి వచ్చిన మాజీ సీఎం జగన్ ను కలిసిన రాజయ్యపేట మత్స్యకారులు బల్క్ డ్రగ్ పార్క్ ని వ్యతిరేకిస్తున్నామని తమకు మద్దతుగా ఉండాలని కోరడంతో జగన్ సూచనలతో వైసిపి బల్క్ డ్రగ్ పార్కు వ్యతిరేకంగా రాజయ్యపేట గ్రామస్తులు చేస్తున్న ఆందోళ నకు మద్దతు తెలిపింది. ఛలో రాజయ్యపేటకు ఎలాంటి పర్మిషన్ లేదంటున్న పోలీసులు. వైసీపీ ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు చలో రాజయ్యపేటకు పిలుపును ఇవ్వడంతో బల్క్ డ్రగ్ పార్కు వ్యతిరేకంగా వైసిపి చేస్తున్న ఉద్యమం ఏ స్థాయిలో ముందుకు వెళ్తుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది? మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ సహా ఉత్తరాంధ్రలోని కీలకమైన వైసీపీ నాయకులు ఛలో రాజయ్యపేట వెళ్లడానికి సిద్ధమయ్యారు. ఇప్పటికే పోలీసులు ఛలో రాజయ్యపేటకు ఎలాంటిపర్మిషన్ లేదు అని చెప్పడంతో వైసిపి నాయకులు ఏం చేస్తారో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఉత్తరాంధ్రలో డిపాజిట్లు కోల్పోయిన వైసీపీ. ఇప్పటికే ఉత్తరాంధ్రలో దాదాపుగా గత గత ఎన్నికల్లో డిపాజిట్లు కోల్పోయిన వైసీపీ రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్కును భుజాన వేసుకుని మద్దతుగా నిలబడి పోరాటం చేస్తే సముద్ర తీర ప్రాంతాల్లో నివాసం ఉండే మత్స్యకార వర్గాల మద్దతు కూడగట్టుకోవచ్చని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే వైసిపి చేలో రాజయ్యపేటకు పిలుపునిచ్చినట్లు అర్థమవుతుంది. వైసీపీ వేసిన ప్లాన్ మరికూటమి ప్రభుత్వం ఏ విధంగా ఎదుర్కొంటుందో వేచి చూడాలి.

# ఆదివాసీల అస్తిత్వ సమస్య!

రకరకాల పంచాయితీలు.. కులాల కుంపట్లు, మతాల మధ్య చిచ్చులు.. .వాటి సృష్టికర్తలు రాజకీయ నాయకులు..పాలకులే కావడం గమనించాలి. తమ స్వార్థ రాజకీయం కోసం రాజకీయ నేతలు ఎంతకైనా తెగిస్తారు. పంచాయితీ ఎన్నికల నగరా మోగడం చూశాక..రిజర్వేషన్ల తకరారు తెరపైకి వచ్చింది. బిసిలు లేని చోట బిసి రిజర్వేషన్లు...ఎస్సటీలు లేనిచోట ఎస్సీ రిజర్వేషన్లు...ఎస్టీలు లేనిచోట ఎస్టీ రిజర్వేషన్లు... ఇదంతా కూడా సమాచార లోపంతో చేసినదిగానే భావించాలి. తమవద్ద మచారం సంపూర్ణంగా లేదనడానికి ఇంతకన్నా నిదర్శనం అక్కర్లేదు. ఈ క్రమంలో బిసిల కులగణన సక్రమంగా జరిగిందనడానికి అనుమానిం చాల్సిందే. బిసిల్లో ఉన్నత వర్గాలకుకాకుండా అట్టడుగు వర్గాలు, కులాలకు టిక్కెట్లు ఇచ్చి కాంగ్రెస్, ఇతర పార్టీలు తమ చిత్తశుద్దిని చాటాలి. రాజకీయంగా అందరికీ అధికారం దక్కేలా చేయాలి. కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలకు పాల్పడితే అది భస్మాసుర హస్తంలా తిరగబడుతుంది. ఎందుకంటే రాజకీయ నాయకులు చేస్తున్న పొరపాట్ల వల్ల ఆయా వర్గాలు లేదా కులాలు ఆందోళనకు దిగడం చూస్తున్నాం. తాజాగా ఎస్టీల ఆందోళన ఈ కోవలోకే వస్తుంది. తమ హక్కులకు భంగం వాటిల్లిందని, తమ ఉనికకే ప్రమాదం ఏర్పడిం దని ఇప్పుడు ఎస్టీలు ఆందోళనకు దిగారు. భయాల నేపథ్యంలో ఆదివాసీ తెగలలోని ఉద్యోగులు, నిరుద్యో గులు, విద్యార్థులు, ప్రజానీకం, ఆదివాసీ సంఘాలతో పాటు, అన్ని పార్టీల ఆదివాసీ ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని ఆయా జిల్లాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. ఇది చూడడానికి స్వల్పంగానే కనిపించినా..అగ్గిరవ్వలాగా ఎక్కడో ఒకచోట తగులబెట్టగలదు. ఎందుకంటే ఆత్మగౌరవానికి దెబ్బతగిలితే దాని పరిణామం తీవ్రంగా ఉంటుంది. డిసెంబర్ 9న ఉమ్మడి ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం, నల్లమల ఏజెన్సీ ప్రాంతాలలోని గూడేల నుంచి తొమ్మిది ఆదివాసీ తెగలు 'చలో రాజ్‌భవన్' నిర్వహిస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించాలని యోచన చేస్తున్నాయి. లంబాడీలను ఎస్టీ జాబితాల నుంచి తొలగించాలన్నది వారి ప్రధాన డిమాండ్ తమ హక్కులను వారు కాలరాస్తున్నారని, తమ అవకాశాలను కొల్లగొడుతున్నారని వారు ఆందోళనలు చేస్తున్నారు. 1976లో నాటి ఉమ్మడి ప్రభుత్వం కేవలం ఓటు బ్యాంకు రాజకీయ లబ్ది కోసం సంచారజాతి కులానికి చెందిన లంబాడా లను ఎస్టీ జాబితాలో చేర్చింది. దీంతో గత యాభై ఏళ్లుగా ఆదివాసులు అన్ని రంగాలలోనూ తీవ్ర అన్యాయానికి గురవుతున్నారన్నది వారి ఆందోళనకు కారణంగా ఉంది. ఆకాలంలో పెద్దగా చదువుకోని, చట్టాలపట్ల అవగాహన లేని ఆదివాసీ రాజకీయ ప్రతినిధుల కారణంగా, ఆర్టికల్ 342 ప్రకారం పార్లమెంటరీ పక్రియలేమీ నిర్వహించకుండా, ఏకపక్షంగా లంబాడా, ఇంకా దానితో సారూప్యత కలిగిన కులాలను ఎస్టీ జాబితాలో చేర్చారు. అప్పటి నుంచీ నాటి హైదరాబాద్ స్టేట్‌లోని 9 ఆదివాసీ తెగలకు చెందాల్సిన 4శాతం రిజర్వేషన్లను గత యాభై ఏళ్ళుగా లంబాడా సామాజిక వర్గాలు యథేచ్ఛగా కొల్లగొడుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఆదివాసులకు న్యాయంగా దక్కాల్సిన భూమి, విద్యా, ఉద్యోగ అవకాశాలను దోచుకోవ డంతో పాటు, అక్రమ రిజర్వేషన్లు గంపగుత్తగా అనుభవించి ఆర్థికంగా, రాజకీయంగా లంబాడాలు బలపడు తున్నారని వీరు ఆందోళనలు చేపట్టారు. గతంలో అనేకమార్లు ఈ ఆందోళనలు సాగాయి. కానీ ఈసారి అవి కొత్త రూపంలో ముందుకు వస్తున్నాయి. ఈనాటి తెలంగాణ రాష్ట్రంలో ఉన్నత వర్గాలకు చెందిన కులాలకు దీటుగా వారు అన్ని డిపార్టుమెంటుల్లోనూ, విశ్వవిద్యాల యాలలోనూ, రాజకీయ పార్టీలలోను తమ ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారు. గతయాభై ఏళ్లుగా అక్రమంగా ఇతర రాష్ట్రాలనుంచి వలస వచ్చిన లంబాడా సామాజిక వర్గాలు తమకు ఉన్న ఓటు బ్యాంకుతో అన్ని రాజకీయ పార్టీలను ప్రభావితం చేస్తూ ఆదివాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అందుకే చట్టబద్ధత లేని లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని తెలంగాణ రాష్ట్రంలోని తొమ్మిది తెగలకు చెందిన ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, ఉద్యోగ సంఘాలు 2017 డిసెంబర్ 9,న లక్షలాదిగా హైదరాబాద్ తరలివచ్చి తమ నిరసన తెలియచేశాయి. యావత్ తెలంగాణ సమాజం మద్దతు పొందాయి



# ఎరుపు రంగు ముల్లంగిని మీరు ఎప్పుడైనా తిన్నారా..?

## దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?

మనకు లభించే అన్ని రకాల కూరగాయల్లోనూ వివిధ వైరైటీలు ఉంటాయన్న సంగతి తెలిసిందే. అందులో భాగంగానే ముల్లంగిలోనూ పలు రకాలు ఉంటాయి. మనకు ఎక్కువగా తెలుపు, ఎరుపు రంగులో ఉండే ముల్లంగి లభిస్తుంది. సాధారణంగా చాలా మంది తెలుపు రంగు ముల్లంగినే తింటారు. కానీ ఎరుపు రంగు ముల్లంగి వల్ల కూడా మనకు అనేక లాభాలు కలుగుతాయి. ఈ ముల్లంగిలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. ఎరుపు రంగు ముల్లంగిలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. అందుకనే అవి ఎరుపు రంగులో ఉంటాయి. కనుక ఈ ముల్లంగిని ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. ఎరుపు రంగు ముల్లంగిలో ఆంథో సయనిన్స్ అధికంగా ఉంటాయి. కనుకనే అవి ఆ రంగులో మనకు దర్శనమిస్తాయి. ఇవి శరీరాన్ని ఫ్రీ ర్యాడికల్స్ బారి నుంచి రక్షిస్తాయి.

**రోగ నిరోధక వ్యవస్థకు..:** ఎరుపు రంగు ముల్లంగిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఆక్సీకరణ ఒత్తిడిని దూరం చేస్తాయి. దీని వల్ల గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు. ఎరుపు రంగు ముల్లంగిలో విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. ఇది రోగ నిరోధక వ్యవస్థను పటిష్టంగా మారుస్తుంది. విటమిన్ సి వల్ల శరీరం ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. ఫలితంగా సీజనల్‌గా వచ్చే దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే విటమిన్ సి సహాయంతో శరీరం కొల్లాజెన్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది చర్మాన్ని సంరక్షిస్తుంది. విటమిన్ సి వల్ల మనం తిన్న ఆహారాల్లో ఉండే ఐరన్‌ను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీంతో రక్తం వృద్ధి చెందుతుంది. రక్తహీనత తగ్గుతుంది. మహిళలకు ఎంతగానో మేలు జరుగుతుంది.

**జీర్ణ వ్యవస్థకు..:** ఎరుపు రంగు ముల్లంగిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది మలబద్దకాన్ని తగ్గిస్తుంది. జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ ముల్లంగిలో అధికంగా ఉండే నీటి శాతం వల్ల శరీరంలో ఉన్న వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి. ముఖ్యంగా జీర్ణ వ్యవస్థ శుభ్రంగా మారుతుంది. ఈ ముల్లంగిలో అధికంగా ఉండే నీటి వల్ల దీన్ని తింటే శరీరం హైడ్రేటెడ్‌గా ఉంటుంది. శరీరంలోని ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. వ్యర్థాలు సులభంగా బయటకు వెళ్లిపోతాయి.


జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడతాయి. మెటబాలిజం మెరుగు పడుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలో శక్తి స్థాయిలు పెరుగుతాయి. ఎరుపు రంగు ముల్లంగి కిడ్నీలు, లివర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఆయా అవయవాలు డిటాక్స్ అవుతాయి. వాటిల్లో ఉండే టాక్సిన్లు సులభంగా బయటకు పోతాయి. దీంతో లివర్, కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. మూత్రం ధారాళంగా, సాఫీగా జారీ అవుతుంది. మూత్రాశయ ఇన్‌ఫెక్షన్లు, మూత్ర సంబంధిత సమస్యలు తగ్గుతాయి.

**బరువు తగ్గేందుకు..:** ఎరుపు రంగు ముల్లంగిలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉంటుంది. కనుక వీటిని తింటే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్నవారు ఎరుపు రంగు ముల్లంగిని రోజూ తింటుంటే ఫలితం ఉంటుంది. ఈ ముల్లంగిలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. బీపీని నియంత్రిస్తుంది. శరీరంలో సోడియం స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది. దీని వల్ల హైబీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యం మెరుగు పడుతుంది. ఇలా ఎరుపు రంగు ముల్లంగిని తరచూ ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు. దీన్ని నేరుగా లేదా ఉడకబెట్టి ఎలా తిన్నా సరే లాభాలు కలుగుతాయి.

# ఆదుకునే అత్యవసర నిధి!




డబ్బు అవసరం.. ఎప్పుడు, ఎలా వస్తుందో తెలియదు. వచ్చిన జీతం.. తిండి, ఇంటి కిరాయి, పిల్లల ఖర్చులకే సరిపోతుంది. ముఖ్యంగా మధ్య తరగతి జీవితాలన్నీ.. ఈఎంఐల చుట్టే తిరుగుతున్నాయి. ఇలాంటి సందర్భంలో అనుకోని సంఘటన ఎదురైతే 'అప్పు' తప్ప మరే దారీ కనిపించదు. ఆ అప్పు పుట్టాలన్నా.. నానా తిప్పలు పడాల్సిందే! అందుకే.. ప్రతి కుటుంబం తమ ఆదాయం నుంచే అత్యవసర నిధి (ఎమర్జెన్సీ ఫండ్)ను ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడే.. అనుకోని సమస్య ఎదురైనా, ధైర్యంగా బయటపడొచ్చు.లక్ష్యం పెట్టుకోవాలి : అత్యవసర నిధి కోసం ఎంత డబ్బు కావాలో ముందే లక్ష్యంగా పెట్టుకోవాలి. అలాగే ఎన్ని నెలల్లో దాన్ని సమకూర్చుకోవాలో కూడా ముందే నిర్ణయించుకోవాలి.బ్యాంకు అకౌంట్ : ఈ అత్యవసర నిధి కోసమే ప్రత్యేకంగా ఒక బ్యాంకు అకౌంట్ తెరవాలి. ఆ అకౌంట్‌ను పేమెంట్ యాప్స్‌తో లింక్ చేయకూడదు. ఎందుకంటే.. ఆ అకౌంట్‌ను తరచూ చెక్ చేస్తుంటే, డబ్బులు విత్ డ్రా చేయాలనిపించే అవకాశం ఉంటుంది.ఆటోమేటిక్ ట్రాన్స్‌ఫర్స్ : సాలరీ అకౌంట్ నుంచి అత్యవసర నిధికి చెందిన అకౌంట్లోకి నెలనెలా ఆటోమేటిక్‌గా డబ్బు వెళ్లేలా ఏర్పాటుచేసుకోవాలి. అప్పుడు ప్రతినెలా గుర్తు పెట్టుకుని.. అకౌంట్లో డబ్బు వేయాల్సిన పని ఉండదుతెలివైన వాడకం: అనుకున్నంత అత్యవసర నిధి జమయ్యాక.. ప్రతి చిన్న విషయానికీ దానిని ఖర్చు చేయకూడదు. వైద్యపరమైన సమస్య లు, ఉద్యోగసమస్యలు ఉన్నప్పుడు మాత్రమేఉపయోగించాలి. అంతేత ప్ప.నెలనెలా వచ్చే ఖర్చుకోసం వీటినిఎట్టిపరిస్థితుల్లోనూ వాడకూడదు.



### ఈ పండ్లు మీకు బయట ఎక్కడ కనిపించినా సరే విడిచి పెట్టకుండా

# తెచ్చుకుని తినండి..

పండ్లంటే చాలా వరకు తియ్యగానే ఉంటాయి. అవి తియ్యగా ఉంటాయి కాబట్టే వాటిని తినేందుకు ఎంతో మంది ఆసక్తిని చూపిస్తుంటారు. అయితే కొన్ని రకాల పండ్లు అంత తియ్యగా లేకున్నప్పటికీ పోషకాలను మాత్రం అధికంగా అందిస్తాయి. అలాంటి పండ్లలో బేరి పండ్లు కూడా ఒకటి. వీటినే ఆంగ్లంలో పియర్ పండ్లు అని కూడా పిలుస్తారు. వీటిల్లో మన శరీరానికి కావల్సిన అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తాయి. బేరి పండ్లు లేత ఆకుపచ్చ లేదా పసుపు రంగులో ఉంటాయి. లోపల తెల్లని గుజ్జు ఉంటుంది. ఇది అంత తియ్యగా ఉండదు. కానీ బోలెడు లాభాలను మాత్రం అందిస్తుంది. ఈ పండ్లలో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు, మినరల్స్ అధికంగా ఉంటాయి. ఇవి మనల్ని అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంచుతాయి. పలు వ్యాధులను నయం చేసేందుకు సహాయం చేస్తాయి.

**జీర్ణ సమస్యలకు..:** పియర్ పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఒక మీడియం సైజ్ పియర్ పండును తింటే సుమారుగా 6 గ్రాముల మేర ఫైబర్ లభిస్తుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మలబద్దకాన్ని తగ్గిస్తుంది. ఫైబర్ వల్ల కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. అధికంగా బరువు ఉన్నవారు పియర్ పండ్లను తరచూ తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. ఈ పండ్లు ప్రీ బయోటిక్ ఆహారంగా కూడా పనిచేస్తాయి. అంటే వీటిని తింటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. పియర్ పండ్లలో ఫ్లేవనాయిడ్స్, ఆంథో సయనిన్స్, విటమిన్ సి అధికంగా ఉంటాయి. ఇవి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లుగా పనిచేస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. కణాలకు జరిగే నష్టాన్ని నివారిస్తాయి. దీంతో గుండె పోటు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా సురక్షితంగా ఉండవచ్చు.

**కొలెస్ట్రాల్ సమస్యకు..:** పియర్ పండ్లలో ఉండే ఫైబర్ మన శరీరంలోని చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను పెంచుతుంది. దీంతో రక్త నాళాల్లో ఉండే అడ్డంకులు తొలగిపోతాయి. ఫలితంగా గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నివారించవచ్చు. శరీరంలో రక్త సరఫరా మెరుగు పడుతుంది. బీపీ నియంత్రణలో ఉంటుంది. హైబీపీ ఉన్నవారు ఈ పండ్లను రోజూ తింటుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. పియర్ పండ్లు కాస్త తియ్యగానే ఉంటాయి. అయినప్పటికీ ఇవి తక్కువ గ్లైసీమిక్ ఇండెక్స్ విలువను కలిగి ఉంటాయి. అందవల్ల ఈ పండ్లను తింటే రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. పైగా ఈ పండ్లలో ఉండే ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు షుగర్ లెవల్స్ ను తగ్గించడంలో సహాయం చేస్తాయి. కనుక డయాబెటిస్ ఉన్నవారు ఈ పండ్లను తింటుంటే మేలు జరుగుతుంది.

**చర్మ సంరక్షణకు..:** పియర్ పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. దీని వల్ల చర్మానికి కావల్సిన పోషకాలు లభిస్తాయి. చర్మం తన సాగే గుణాన్ని పొందుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. మృదువుగా మారి తేమగా ఉంటుంది. వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. పియర్ పండ్లలో ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉంటాయి కనుక ఇవి యాంటీ ఇన్ ఫ్లామేటరీ సమ్మేళనాలుగా కూడా పనిచేస్తాయి. దీని వల్ల శరీరంలో ఉండే వాపులు, నొప్పులు తగ్గిపోతాయి. ముఖ్యంగా ఆర్థరైటిస్ ఉన్నవారికి మేలు జరుగుతుంది. పియర్ పండ్లను కొందరు తొక్క తీసి తింటారు. కానీఈ పండ్లను తొక్కతోసహా తినాల్సి ఉంటుంది. పియర్ పండ్ల తొక్కలోనూ అనేక పోషకాలు ఉంటాయి. కనుక ఈ పండ్లను తొక్కతో తింటే ఇంకా ఎక్కువ లాభాలు కలుగుతాయి. ఇలా పియర్ పండ్లను తరచూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు.

# క్షేమంగా వెళ్లిరండి..!

**వానాకాలం ప్రయాణాలు.. కొందరికి ఉత్సాహాన్ని అందిస్తాయి. మరికొందరిని అనారోగ్యాల బారిన పడేస్తాయి. మరీ ముఖ్యంగా.. గర్భిణులను మరింత ఇబ్బంది పెడుతాయి. ఈ సమయంలో వాళ్లు అత్యంత జాగ్రత్తగా మెలగాలని గైనకాలజిస్టులు సూచిస్తున్నారు. ప్రయాణాలు సాఫీగా సాగాలంటే.. కింది జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు.**

డాక్టర్ సలహా మేరకు: గర్భిణులు ప్రయాణాలు చేసేముందు గైనకాలజిస్టును కలవడం తప్పనిసరి. మొదటి, చివరి త్రైమాసికంలో ప్రయాణాలను విరమించుకోవడమే ఉత్తమం. గర్భధారణ సమస్యలు ఉన్నప్పుడు ప్రయాణాలు రద్దు చేసుకోవాలి. గర్భిణులు ఎక్కడికి వెళ్లినా మెడికల్ రిపోర్టులు, అత్యవసర ఫోన్ నంబర్లను ఎల్లప్పుడూ వెంట ఉంచుకోవాలి.

సరైన రవాణా: వానాకాలంలో రైళ్లు, బస్సుల్లో ప్రయాణించడం ఇబ్బందికరం. విమానంలో ప్రయాణించేటప్పుడు ఎయిర్‌లైన్స్ నిబంధనలను తప్పకుండా తెలుసుకోవాలి. గర్భం దాల్చిన 36 వారాల తరువాత విమానంలో ప్రయాణించకపోవడమే మంచిది. సొంత వాహనాల్లో వెళ్లడమే సురక్షితం.

ముందే తెలుసుకోండి: ప్రయాణాలకు సిద్ధమయ్యే ముందే.. వాతావరణ పరిస్థితులను తెలుసుకోండి. వెదర్ యాప్స్, వెబ్‌సైట్లను పరిశీలించండి. భారీ వర్ష సూచనలు ఉన్నప్పుడు ప్రయాణం వాయిదా వేసుకోవడమే మంచిది.

సౌకర్యంగా ఉండండి: వదులుగా ఉండే కాటన్ దుస్తులు వేసుకోవడం వల్ల.. ప్రయాణాల్లో సౌకర్యవంతంగా ఉంటుంది. వాటర్‌ప్రూఫ్ జాకెట్లు, గొడుగు కూడా వెంట ఉంచుకోవాలి.



తడిగా ఉన్న చోట జారి కిందపడిపోకుండా.. యాంటి స్లిప్ చెప్పులు వాడండి. శుభ్రత పాటించాల్సిందే: వానాకాలంలో ఎక్కువగా మూత్రాశయ ఇన్ఫెక్షన్లు, జీర్ణ సంబంధ ఇన్ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే, పరిశుభ్రత తప్పకుండాపాటించాలి. చేతులుశుభ్రం చేసుకోవడానికి శానిటైజర్లు, టవల్స్, టిష్యూలు, టాయిలెట్ సీట్ డిస్ ఇన్‌ఫెక్టెంట్ స్ప్రే వెంట ఉంచుకోండి. పబ్లిక్ టాయిలెట్లకు వీలైనంత దూరంగా ఉండండి.

సమతుల ఆహారం: వానాకాలంలో బయటి ఆహారం తినకపోవడం మంచిది. ముందుగానే కోసిపెట్టుకున్న పండ్లు, సలాడ్లు, మూతలేకుండా ఉంచిన ఆహారం తినడం మంచిది కాదు. నూనె, మసాలాలు, ఉప్పు ఎక్కువగా ఉన్న ఆహారం తింటే.. లేనిపోని అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఛాతీలో మంట, అజీర్ణం వంటివి ఇబ్బంది పెడతాయి. పరిశుభ్రమైన వాతావరణంలో చేసిన ఆహారాన్ని మాత్రమే తీసుకోండి.

# అందం కోసం.. అవి వాడొద్దు

ఆడవాళ్లు అందానికి అధిక ప్రాధాన్యం ఇస్తారు. అందునా.. ముఖ వర్చస్సుకు మెరుగులు దిద్దుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపుతారు. ఇందుకోసం నానా రకాల సౌందర్య ఉత్పత్తులను ఆశ్రయిస్తుంటారు. కొందరు బ్యూటీ పార్లర్లకు క్యూ కడితే.. మరికొందరు ఇంటి చిట్కాలతోనే సరిపెట్టుకుంటారు. అయితే, కొన్ని సందర్భాల్లో తెలిసీతెలియకుండానే చిన్నచిన్న తప్పులు చేస్తుంటారు. ఏది పడితే అది ఇష్టారాజ్యంగా వాడేస్తుంటారు. అలా అందాన్ని చేతులారా పాడు చేసుకుంటారు. అలా కావొద్దంటే.. కొన్నిటిని పక్కన పెట్టేయాలని నిపుణులు సూచిస్తున్నారు.

వ్యాక్స్‌తో జాగ్రత్త!: ముఖంపై అవాంఛిత రోమాల్ని తొలగించుకోవడానికి చాలామంది 'వ్యాక్స్'ను ఆశ్రయిస్తారు. అయితే, సరైనదాన్ని ఎంచుకోవడంలో పొరపాటు పడుతుంటారు. మహిళల చర్మతత్వాన్ని బట్టి 'వ్యాక్స్'ను ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సున్నిత చర్మం ఉండేవారు.. కఠినమైన వ్యాక్స్‌ను వాడటం వల్ల ముఖ వర్చస్సు దెబ్బతింటుంది. ముఖంపై దద్దుర్లు రావడం, ఎర్రగా మారడం, ముడతలు పడటం లాంటి సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి ఫేషియల్ వ్యాక్స్ వేసుకునే ముందు.. ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవాలని చెబుతున్నారు.

నిమ్మ.. అలా వద్దు!: ఆరోగ్యంతోపాటు అందాన్ని కాపాడటంలోనూ 'నిమ్మ పండు' ముందుంటుంది. అయితే, చాలామంది దీనిని నేరుగా ముఖంపైనే అప్లయి చేస్తుంటారు. ఇలా చేయడం చాలా ప్రమాదకరం.



నిమ్మకాయలో ఉండే అధిక ఆమ్లత్వం.. చర్మానికి హాని కలిగిస్తుంది. ముఖం ఎర్రబడటం, చికాకు, దురద లాంటి సమస్యలు తలెత్తుతాయి. అందులోనూ సున్నితమైన చర్మం, మొటిమలు ఎక్కువగా ఉన్నవాళ్లు.. నిమ్మకాయను నేరుగా వాడటం ఏమాత్రం మంచిది కాదు. దానికి బదులుగా తేనె, చక్కెర, నీటితో కలిపి నిమ్మకాయను చాలా తక్కువ మొత్తంలో వాడాలి. నిమ్మకు బదులుగా బంగాళాదుంప, టమాటా వంటివి ఎంచుకుంటే మరీ మంచిది. అది బాడీ కోసమే..: చర్మానికి తేమను అందించే 'బాడీ లోషన్'ను.. చాలా మంది ముఖానికి వాడుతుంటారు. దీనివల్ల ముఖం జిడ్డుగా మారుతుంది.

# చేతులు లేకపోయినా ఫుడ్ డెలివరీ..

## సంపాదనలో కొంత మేర దానం
## పెదవులతో కస్టమర్లకు ఫోన్ కాల్స్
## ఆదర్శంగా నిలుస్తున్న చైనీయుడు





బీజింగ్ : చైనాలోని హునాన్ ప్రావిన్స్‌కు చెందిన లీ జియాంగ్యాంగ్ (30) అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. గ్రామీణ నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన నాలుగేళ్ల వయసులోనే విద్యుదాఘాతం వల్ల రెండు చేతులను కోల్పోయారు. దీంతో వారి కుటుంబం అప్పుల ఊబిలో కూరుకుపోయింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబానికి తన వంతు సాయం చేయాలనే ఆలోచనతో ఎనిమిదేళ్ల వయసు నుంచి కాలిగ్రఫీ ప్రాక్టీస్ చేయడం ప్రారంభించారు. తన కాలి వేళ్లతో కాలిగ్రఫీ వర్క్‌ను విక్రయించి, కొంత సొమ్ము సంపాదించేవారు. లీ మీడియాతో మాట్లాడుతూ, జరిగినదానిని మార్చలేమని, తాను ముందుకు సాగక తప్పదని చెప్పారు. తనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. పిల్లల్ని కిండర్‌గార్టెన్ స్కూల్లో చేర్పించవలసి ఉండటంతో తాను జూలై నుంచి పార్ట్ టైమ్ ఫుడ్ డెలివరీ ఏజెంట్‌గా పని చేస్తున్నానని తెలిపారు. యూనిసైకిల్‌పై కస్టమర్ల వద్దకు వెళ్లి, ఫుడ్‌ను అందిస్తానన్నారు. మోచేతికి కట్టుకున్న ఫోన్‌ను పెదవులతో ఆపరేట్ చేసి, కస్టమర్లకు కాల్ చేస్తానని తెలిపారు. రెస్టారెంట్ల సిబ్బంది, కస్టమర్లు తనకు సహకరిస్తున్నారన్నారు. కొందరు తనకు టిప్స్ కూడా ఇస్తూ ఉంటారని చెప్పారు.

# అమెరికా, చైనాల కొత్త ప్రయాణం...



న్యూఢిల్లీ, : అగ్రరాజ్యం అమెరికా? రెండో అగ్రరాజ్యం చైనా.. ఈ రెండు దేశాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటుంది. ట్రంప్ 2.0 పాలనలో చైనాపై సుంకాలతో విరుచుకుపడుతున్నాడు. చైనా కూడా ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. అమెరికా దిగుమతులపైనా సుంకాలు విధిస్తోంది. మరోవైపు అమెరికాకు ఎగమితి చేసే రేర్ ఎర్త్ మినరల్స్‌పై పట్టు బిగిస్తోంది. దీంతో ఇరు దేశాల మధ్య కోల్డ్ వార్ కొనసాగుతోంది. ఇలాంటి తరుణంలో ఇరు దేశాల అధినేతలు తాజాగా భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. దక్షిణ కొరియా నగరం బూసాన్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ మధ్య గురువారం జరిగిన భేటీ ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. రెండు గంటలపాటు ముగిసిన ఈ చర్చలు గత కొన్ని నెలలుగా ఉత్కంఠ రేపిన వాణిజ్య ఉద్రిక్తతలకు కొంత ఊరట తీసుకువచ్చాయి.చైనాపై విధించిన 20 శాతం ఫెంటనిల్ టారిఫ్‌ను 10శాతానికి తగ్గించారని ట్రంప్ ప్రకటించారు. ఫెంటనిల్ ముడి పదార్థాల అక్రమ రవాణాను అరికట్టే అంశంపై జిన్ పింగ్ వ్యక్తిగతంగా కట్టుబడి ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ నిర్ణయం అమెరికాలో పెరుగుతున్న ఓపియాయిడ్ వ్యసన సంక్షోభానికి పరిష్కారం కోసం ద్వైపాక్షిక సహకారానికి నాంది అని పరిశీలకులు అభిప్రాయపడ్డారుఇక ఇదే సమయంలో అరుదైన ఖనిజాల సరఫరాలో ఇటీవల తలెత్తిన సంక్షోభం ఈ సమావేశంలో పరిష్కారమైంది. ఇరుదే శాలు ఒక సంవత్సర కాలానికి ఎగుమతి దిగుమతి నిర్బంధాలపై సడలింపు ఇవ్వడానికి అంగీకరించాయి. గతంలో 100 శాతం సుంకాల హెచ్చరికలు అమెరికా నుంచి రావడం, ఇప్పుడు వాటి ఉపసంహరణ చైనా పరిశ్రమలకు ఉపశమనం తీసుకువచ్చింది. చైనాతో రైతు ఉత్పత్తుల వ్యాపారం మళ్లీ మొదలవుతుందని ట్రంప్ ప్రకటిం చారు. అమెరికా సోయాబీన్ ఎగుమతులకు చైనా తక్షణ అనుమతి ఇవ్వడంతో మధ్య పశ్చిమ రాష్ట్రాల వ్యవసాయ రంగానికి ఇది కీలక మలుపుగా మారనుంది.ట్రంప్ ప్రకారం, యూరప్ సంక్షోభ పరిష్కారం లో చైనా సహకరించడానికి అంగీకరించింది. ఈ అంశం వాషింగ్టన్ బీజింగ్ సంబంధాలను కేవలం ఆర్థికం దాటి గ్లోబల్ భద్రతా స్థాయి వరకు విస్తరింపజేసే అవకాశముంది. ఈ చరిత్రాత్మక భేటీ ఎయిర్ పోర్టు పరిధిలో జరగడం ఆశ్చర్యం కలిగించింది. అయితేసమయాభావం కారణంగా తక్షణంగా ఈ వేదికను ఎంచుకున్నట్లు తెలింది. షెడ్యూల్ ప్రకారం ట్రంప్‌వెళ్లే ముందు చివరినిమిష ంలో భేటీఏర్పాటు కావడంతో అది తాత్కాలిక ప్రదేశ ంలో పూర్తయి ంది. ప్రసంగంలో ట్రంప్‌జిన్ పింగ్‌ను 'తన కాలంలో అత్యంత మేధావినాయకుడు'గా చిత్రీకరించారు. "10లో12మార్కులు ఆయనకు ఇవ్వగలను" అని ఆయన వ్యాఖ్యలు రెండు దేశాల మధ్యవ్య క్తిగత సాన్నిహిత్యాన్ని ప్రతిబింబించాయి.ఈ భేటీతో తాత్కాలిక ఉద్రిక్తత తగ్గినప్పటికీ, పూర్తి వాణిజ్య ఒప్పందానికి మార్గం ఇంకా ప్రారంభ దశలోనే ఉందని నిపుణులు భావిస్తున్నారు. అమెరికా వచ్చే ఏడాదిచైనాపై వాణిజ్య విధానాల్లో సడలింపు ఇచ్చే అవకాశం ఉందన్న సంకేతాలు ఈ సమావేశం ద్వారా వెలుగులోకి వచ్చాయి.

# అమెరికాకు 62 వేల కోట్ల నష్టం

## ఒడిదుడుకుల్లో ఆర్థికం



న్యూయార్క్, : ఏ ముహూర్తంలో ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాడో తెలియదు గాని.. ఆ దేశానికి ఏది కూడా కలిసి రావడం లేదు. ఆంక్షలు.. సుంకాలు.. ప్రపంచ దేశాలను అనేక విధాలుగా ఇబ్బంది పెడుతున్నాడు ట్రంప్. ఒక రకంగా ప్రత్యక్ష నరకం అంటే ఏమిటో చూపిస్తున్నాడు. వాస్తవానికి ట్రంప్ విధిస్తున్న సుంకాలవల్ల ప్రపంచ దేశాల కంటే అమెరికాకే నష్టం ఎక్కువగా జరుగుతోంది. ఈ విషయాన్ని ట్రంప్ గుర్తించడం లేదు. ఏమాత్రం లెక్కలోకి తీసుకోవడం లేదు.ట్రంప్ వ్యవహరిస్తున్న తీరు ప్రపంచ దేశాలను ఇబ్బంది పెడుతోంది. అమెరికాలోని విపక్ష పార్టీల నేతలు కూడా ట్రంప్ తీరు పట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా అమెరికాలో కీలక బిల్లుల విషయంలో విపక్ష పార్టీ నిరసన వ్యక్తం చేసింది. బిల్లుల విషయంలో అధికార పార్టీ తీసుకొచ్చిన విధానాలకు వ్యతిరేకంగా స్వరం వినిపించింది. దీంతో అమెరికా ప్రభుత్వం ప్రస్తుతం షట్ డౌన్ అనే పరిస్థితిని ఎదుర్కొంటున్నది. గడిచిన 31 రోజులుగా అమెరికా ఆర్థిక వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నది. దీనివల్ల అమెరికాలో ఏకంగా 62,000 కోట్ల సంపద ఆవిరి అయిపోయింది.పరిస్థితి ఇలాగే కొనసాగితే 11 బిలియన్ డాలర్ల సంపద ఆవిరి అయిపోతుందని కాంగ్రెషనల్ బడ్జెట్ ఆఫీస్ పేర్కొంది. ఈ షట్ డౌన్ చాప కింద నీరు లాగా విస్తరిస్తోందని ఆర్థిక రంగ నిపుణులు పేర్కొంటున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ బలహీనంగా మారిపోవడం వల్లే ఇదంతా జరుగుతోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఇది ఊహించిన దానికంటే అతిపెద్ద సమస్యగా మారే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికాలో 1981 నుంచి షట్ డౌన్ అనేది కొనసాగుతూ వస్తోంది. అమెరికా ప్రభుత్వం ఇప్పటివరకు 10 సార్లు మూతపడింది. అమెరికాలో ట్రంప్ అధ్యక్షుడైన తర్వాత 2018 -19 కాలంలో దాదాపు 35 రోజుల పాటు ప్రభుత్వం మూతపడింది. అమెరికా దేశ చరిత్రలోనే అతిపెద్ద సుదీర్ఘమైన మూసివేత అని అక్కడి నిపుణులు చెబుతున్నారు. ఇక ప్రస్తుతం చట్టసభ సభ్యుల మధ్య ఏమాత్రం రాజ

కుదరడం లేదు. ఈ ప్రకారం తీసుకుంటే గత రికార్డును ఈసారి చోటు చేసుకున్న షట్ డౌన్ బద్దలు కొడుతున్న అనే అనుమానాలు వ్యక్తంఅవుతున్నాయి. ఇప్పటికే అమెరికా జాబ్ మార్కెట్ చాలా బలహీనంగా ఉంది. షట్ డౌన్ ప్రభావం జాబ్ మార్కెట్ మీద తీవ్రతగా అనిపిస్తోంది. ఆర్థిక విధానాలు ఏమాత్రం బాగోలేదు. పైగా రాజకీయంగా కూడా ట్రంప్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కంపెనీలు పెట్టుబడి పెట్టే విషయంలో ఆలోచిస్తున్నాయి. మిగతా కంపెనీలు కృత్రిమ మేధ, ఆటోమేషన్ మీద ఆధారపడుతున్నాయి. ఇవన్నీ కూడా ఉద్యోగులకు నరకం చూపిస్తున్నాయి.

# ఖమ్మంలో రోప్‌వే, తీగల వంతెన, రిటైనింగ్ వాల్స్



**ఖమ్మం,తెలంగాణ దిశ :** ఖమ్మం జిల్లాలో పలు అభివృద్ధి ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. అయితే వేగం పుంజుకోకపోవడానికి కారణం.. భూసేకరణ సమస్య. ఈ ప్రాజెక్టులు ఖమ్మం జిల్లాకు వచ్చిన తర్వాతనే అక్కడ చుట్టుపక్కల ప్రాంతాల స్థలాలకు ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో నిర్మాణాలకు కావాల్సిన భూమిని ఇచ్చేందుకు యజమానులు ఒప్పుకోవడం లేదు. ధరలు అధికంగా ఉండటంతో.. ప్రభుత్వానికి స్థలాలు అప్పగించేందుకు నిరాకరిస్తున్నారు. అయితే దీనిపై త్వరలోనే కదలికి వచ్చి.. ప్రాజెక్ట్ పనులు పూర్తి కానున్నాయి. ఖమ్మం జిల్లా కేంద్రంలో అభివృద్ధి పనులు ఊపందుకోవడంలో భూసేకరణ ప్రధాన సమస్యగా మారింది. భూముల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో నిర్వాసితులను ఒప్పించడం రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారింది. అభివృద్ధి ప్రాజెక్టులు సమయానికి పూర్తయ్యేలా ప్రభుత్వ యంత్రాంగం కృషి చేస్తున్నప్పటికీ.. భూసేకరణలో ఎదురయ్యే ప్రతిబంధకాలు వేగాన్ని తగ్గిస్తున్నాయి.ఖమ్మం ఖిల్లాలో రూ.29 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రోప్‌వే ప్రాజెక్ట్ మొదటి అడ్డంకిని అధిగమించింది. తొమ్మిది ఇళ్లకు పరిహారం అందించడంతో నిర్మాణం కోసం మార్గం సుగమమైంది. నాలుగు క్యాబిన్ల తయారీ, టవర్ల పనులు వర్క్‌షాప్‌లో జరుగుతు న్నాయి.

లోయర్, అప్పర్ స్టేషన్లు సిద్ధం చేస్తే 2026 ఆగస్టు నాటికి రోప్‌వే ప్రజలకు అందుబాటులోకి రానుంది.గతేడాది మున్నేరు నది ఉప్పొంగడంతో పరిసర ప్రాంతాలు మునిగిపోయాయి. భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకుండా ఉండేందుకు ప్రభుత్వం రూ.690 కోట్లతో 17 కిలోమీటర్ల రిటైనింగ్ గోడలు నిర్మిస్తోంది. ఇందుకోసం 239 ఎకరాల భూమి అవసరం. ప్రభుత్వ భూమిపై కొంతమేర పనులు పూర్తవగా.. ప్రైవేటు భూమి సేకరణలో ఆటంకం తలెత్తింది. అధికారులు 2026 జూన్ లోగా ఈ పనులు ముగించాలని నిర్ణయించారు.నగర శుద్ధి వ్యవస్థను బలోపేతం చేసేందుకు రూ.239 కోట్లతో భూగర్భ మురుగుకాల్వలు మరియు ఎస్టీపీలు నిర్మిస్తున్నారు. పుట్టకోటలో 9.50 ఎంఎల్‌డీ సామర్థ్యం గల ప్లాంట్‌కు సమస్యలు లేకపోవడంతో పనులు వేగంగా సాగుతున్నాయి. అయితే ధంసలాపురంలో ప్రైవేటు భూమి కారణంగా అడ్డంకులు ఎదురవుతున్నాయి.హైదరాబాద్ తరహాలో రూ.183 కోట్లతో ఖమ్మం కాల్వొడ్డు ప్రాంతంలో తీగల వంతెన నిర్మాణం జరుగుతోంది. 167 సెగ్మెంట్లలో ఇప్పటివరకు 100 ఏర్పాటు చేశారు.

వరదల కారణంగా కొన్ని పనులు ఆగిపోవడంతో ఆలస్యం ఏర్పడింది. ప్రభుత్వం విడుదల చేసిన నిధులు సరిపోక, కాంట్రాక్టర్లు పనులు నెమ్మదిగా కొనసాగిస్తున్నారు. 2026 మార్చి నాటికి ఈ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులు, గృహ యజమానులకు ప్రత్యామ్నాయ స్థలాలను అందించేందుకు సర్కారు వెంచర్‌ను సిద్ధం చేస్తోంది. దీంతో భూసేకరణపై ఉన్న అభ్యంతరాలు తొలగి, పనులు వేగంగా పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

# ఇంద్రప్రస్థగా న్యూఢిల్లీ...

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీ పేరు మారే చాన్స్ ఉందా? ఢిల్లీ పేరును ఇంద్రప్రస్థగా మార్చాలంటూ ఇప్పటికే విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. లేటెస్టుగా భారతీయ జనతా పార్టీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ ఇదే డిమాండ్ చేశారు. దేశ రాజధాని ఢిల్లీ. వందల వేల ఏళ్ల చరిత్ర ఉన్న చారిత్రక నగరం. మనకు స్వాతంత్ర్యం రాకముందు ఢిల్లీ రాజధానిగా బ్రిటీషర్లు, అంతకుముందు మొఘల్స్, అంతకు ముందు ఢిల్లీ సుల్తానేట్, ఇంకా ముందు పృథ్వీరాజ్ చౌహాన్ లాంటి రాజపుత్ర వీరులు ఢిల్లీ రాజధానిగా పరిపాలించారు. చరిత్ర పొరలను తవ్వుకుంటూ వెళితే, ఇది మహా భారత కాలానికి చేరుతుందని చెబుతారు. భారతంలో పాండవులు పరిపాలించిన ఇంద్రప్రస్థ ఇదేనని హిందువుల నమ్మకం.ఢిల్లీ పేరును ఇంద్రప్రస్థగా మార్చడం ద్వారా, అది మన దేశ చారిత్రక, సాంస్కృతిక, నాగరికత మూలాలను ప్రతిబింబిస్తుందని బీజేపీ ఎంపీ ఖండేల్వాల్ చెబుతున్నారు. ఓల్డ్ ఢిల్లీ రైల్వేస్టేషన్, అంతర్జాతీయ విమానాశ్రయాల పేర్లను కూడా మార్చాలని ఆయన డిమాండ్ చేశారు. దేశ రాజధానిలో పాండవుల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. ఈమేరకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. మహా భారత కాలంలో పాండవులు పరిపాలించిన ఇంద్రప్రస్థఇప్పటి ఢిల్లీ నగరంగా మారిందని హిందూ సంఘాలు చెబుతున్నాయి.ఢిల్లీ పేరు మార్పు డిమాండ్‌కు మద్దతుగా వాళ్లు కొన్ని రీజన్లు చెబుతున్నారు. యమునా తీరంలో ఇంద్రప్రస్థ నగరం నిర్మాణం జరిగిందని, పాండవుల కోసం దేవశిల్పి విశ్వకర్మ దీన్ని నిర్మించారని మహా భారతం చెబుతోంది. ఇక ఢిల్లీలోని పురానా ఖిల్లా ప్రాంతమే ఇంద్రప్రస్థ అని హిందుత్వ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఢిల్లీ నగరమూలాలు ఇంద్రప్రస్థలో ఉన్నాయనే వాదనను వాళ్లు ముందుకు తెస్తున్నారు. ఢిల్లీ పేరును ఇంద్రప్రస్థగా మార్చడం ద్వారా, దేశ చారిత్రక, సాంస్కృతిక మూలాలను కాపాడవచ్చు నే వాదన వినిపిస్తున్నారు ఇప్పుడు ఢిల్లీలో బీజేపీ అధికారంలో ఉంది. అటు కేంద్రాన్ని కూడా బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే పరిపాలి స్తోంది. ఈ నేపథ్యంలో.. ఢిల్లీ పేరును ఇంద్రప్రస్థగా మార్చాలనే డిమాండ్‌పై కేంద్రం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది.

# అంటువ్యాధులు రాకుండా చర్యలు...!

## ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో మందులు

**నల్గొండ,తెలంగాణ దిశ :** అంటు వ్యాధులు ప్రబలకుండా జిల్లా వ్యాప్తంగా ఎపిడమిక్ సెల్, రెస్క్యూ టీంలను ఏర్పాటు చేశామని నల్గొండ జిల్లావైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ వెల్లడించారు. డివిజన్ల వారీగా జిల్లా కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులకు సెలవులు రద్దు చేశామని, అత్యవసర సేవలు అందించేందుకు పాము, తేలుకాటుకు సంబంధించిన ఔషధాలు సిద్ధంగా ఉంచామన్నారు. డెంగీ, జ్వరాలు రాకుండా కాచిచల్లార్చిన నీటిని తాగాలి. వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తలు పాటించాలన్నారు. మూడు జిల్లాసుపత్రుల్లో రోగులు చికిత్స కోసం వచ్చినా తగిన ఏర్పాట్లు చేసినట్లు వైద్యులు తెలిపారు. ఎక్కువగా జ్వరాలు, దగ్గు, జలుబు వంటి అంటువ్యాధులతో పాటు పదుల సంఖ్యలో రైతులు పాము, తేలుకాటుకు గురైనవారు ఉన్నట్లు పేర్కొన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో సరిపడా అత్యవసర మందులు అందుబాటులో ఉంచారు. పల్లె, బస్తీ దవాఖానాల్లోని వైద్యులకు నవంబరు 3 వరకు అత్యవసర పరిస్థితుల్లో తప్ప సెలవులు రద్దు చేశారు. ఇకపోతే మొంథా తుపాను ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో కొన్ని రహదారులు ఛిద్రమయ్యాయి.

లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా .. శిథిలమైన పాత భవనాలు, ఇళ్లు నేలమట్టమయ్యాయి. ప్రధానంగా సూర్యాపేట-వరంగల్ ప్రధాన రహదారిపై నెమ్మికల్ వద్ద రహదారి కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచాయి. దీంతో అధికారులు చివ్వెంల-ఏపూరు మీదుగా ఖమ్మం రోడ్- వరంగల్‌కు భారీ, చిన్నతరహా వాహనాలను మళ్లించారు. చింతలపాలెం-దొండపాడు వద్ద 100 మీటర్ల వరకు రహదారిపై కోత పడటంతో వాహ నదారులు ఇబ్బంది పడ్డారు. యాదాద్రి జిల్లాలోని రుద్రవెల్లి-జూలూరు, బొల్లేపల్లి-సంగెం గ్రామాల మధ్య వరద ఉధృతి తగ్గే వరకు రాకపోకలు నిలిపివేశారు.

# రేగా ఉడత బెదరింపులకు భయపడేది లేదు

## వందకోట్ల బేరంతో దొరికిన అసలు తెలంగాణ ద్రోహి


## పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విమర్శలు

**భద్రాద్రి కొత్తగూడెం,తెలంగాణ దిశ :** మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు చేస్తున్న ఉడత ఊపులకు, తాటాకు చప్పుళ్లకు కాంగ్రెస్ నాయకులు గానీ కార్యకర్తలు కానీ భయపడే పరిస్థితులు లేవని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. పార్టీ ఫిరాయింపులో 100 కోట్ల బేరసారాలు ఆడి అడ్డంగా దొరికిన తెలంగాణ ద్రోహి రేగా అని, ఆయనకు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ కార్యాలయానికి సంబంధించిన చరిత్రను వివరించారు. స్థలం దానంగా ఇచ్చినప్పటి నుంచి భూమి పూజ, ప్రారంభోత్సవంతో పాటు ఇంటి పన్నుల వివరాలు అందరికీ తెలుసని, వాటి రశీదులు, కరెంటు బిల్లులు, అన్ని ధ్రువపత్రాలు ఉన్నాయని తెలిపారు. 2009లో రెడిమేడ్‌గా వచ్చిన నాయకుడు రేగాకు నియోజకవర్గ దిక్కులు కూడా తెలియవని, నాడు అతడిని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పార్టీ గెలిపిస్తే బేరసారాలు చేసి పార్టీ ఫిరాయించిన సంగతి అందరికీ తెలుసునన్నారు. ఆయన పార్టీ మారుతూ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల శక్తితో కట్టుకున్న భవనాన్ని కబ్జా చేశాడని ఆరోపించారు. తాను గెలిచిన తర్వాత నాయకులు, కార్యకర్తలు మన ఆఫీసును మనం స్వాధీనం చేసుకుందామని అన్నా.. తాను సముదాయించానన్నారు. కానీ ఆదివారం నాయకులు, కార్యకర్తలు ఆఫీసుకు వెళ్లిన సమయంలో బీఆర్‌ఎస్ వారు తమ వారిపట్ల వ్యవహరించిన తీరు ఉద్రిక్తతకు కారణమైందన్నారు. రేగా కాంతారావు రెచ్చగొట్టగా.. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు రెచ్చిపోయారని, దాన్ని తమ పార్టీ వారు ప్రతిఘటించారన్నారు.

తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు చేసిన చర్యను తాను అభినందిస్తున్నానని ఎమ్మెల్యే పాయం తెలిపారు. తన ముఖ్య అనుచరుడు నవీన్‌కు చందా హరికృష్ణ ఆ భవనాన్ని అమ్మాడని, ఇందుకు సంబంధించి పత్రాలు తమ వద్ద ఉన్నాయన్న పాయం వాటిని విలేకరులకు చూపారు. భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య మాట్లాడుతూ.. మణుగూరులో కాంగ్రెస్ పార్టీ భవనాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడం సాహసోపేత నిర్ణయమన్నారు. పార్టీ మారిన రేగా తర్వాత తెలంగాణ భవన్‌గా మార్చాడని, ఆభవనం

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల ఆస్తి అని అన్నారు. పినపాక నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణులకుశిరస్సు వంచి నమస్కారాలు తెలియజేసుకుంటున్నానని పొదెం వీరయ్య తెలిపారు. రేగా మాటలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు నియోజకవర్గ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శివకేశవులకు ప్రీతిపాత్రం పౌర్ణమి



## కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన రోజు


**తిరుమల,తెలంగాణ దిశ :** ఏడాదిలో పవిత్రమైన మాసాలు చాలానే ఉన్నాయి. అయితే కార్తీక మాసం అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలో అన్ని రోజులు పవిత్రమైనవే. ఈ మాసంలో వచ్చే కార్తీక పౌర్ణమి.. మహాశివరాత్రితో సమానమైన రోజని పండితులు చెబుతారు. ఈ పౌర్ణమి.. శివకేశవులు ఇద్దరికి అత్యంత ప్రీతికరమైన రోజని అంటారు. అలాంటి వేళ.. భక్తులంతా 365 వత్తులతో శివాలయంలో దీపారాధన చేస్తారు. కార్తీక పౌర్ణమి.. మహాశివరాత్రితో సమానమని పండితులు చెబుతారు. అందుకే పౌర్ణమిరోజు సముద్ర, నదీ స్నానాలకు భక్తులు పోటెత్తుతారు. అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేస్తారు. అందులో భాగంగా.. 365 వత్తులతో దీపారాధన చేస్తారు. ఇక ఈ రోజు.. కేదారేశ్వర స్వామి, సత్యనారాయణ స్వామి వ్రతాలు, కార్తీక నోములు సైతం భక్తి శ్రద్ధలతో నోచుకుంటారు. ఈ రోజు ఈ పూజలు చేయడం వల్ల విశేష ఫలితాలను భక్తులు అందుకుంటారు. కార్తీక పౌర్ణమి రోజు తెల్లవారు జామునే నిద్ర లేచి.. పవిత్ర స్నానం ఆచరించి పరమ శివుడు, మహా విష్ణువు, శ్రీలక్ష్మీని పూజించాలి. నదిలో దీపాలను దానం చేస్తే మంచిది. అలా కుదరకుంటే ఆలయంలోనైనా దీపాన్ని దానం చేయాలి. విష్ణు సహస్ర నామాలతోపాటు లలితా సహస్ర నామాలు సైతం పారాయణం చేస్తే మంచి జరుగుతుంది. చంద్రుడికి పచ్చిపాలను నీటిలో కలిపి అర్పిస్తే విశేష ఫలితాలు పొందవచ్చు.

కార్తీక పౌర్ణమి వేళ.. గోదానం చేయడం వల్ల మంచి ఫలితాలు అందుకోవచ్చు. బెల్లం, దుస్తులను పేదలకు దానం చేయడం వల్ల శుభం జరుగు తుంది. ఇలా దీపం వెలిగించడం వల్ల పుణ్యం లభిస్తుందంటారు. అంటే ఏడాదికి 365 రోజులు. ఒక్కోరోజుకు ఒక్కో వత్తిగా పరిగణిస్తారు. ఈ దీపాలను అరటి దోసలో పెట్టి నదులు, దేవాలయాల్లోని కోనేటిలలో వదులుతారు. ఈ పౌర్ణమి రోజు దీపం వెలిగిస్తే.. అశ్వమేధయాగం చేసినంత ఫలితం లభిస్తుందంటారు. ఈ 365 వత్తులను ఇంటి ముందు తులసికోట వద్ద వెలిగిస్తే.. సర్వదోషాలు తొలగిపోతాయని చెబుతారు. ఈ కార్తీక పౌర్ణమి రోజు.. మృత్యుంజయ మంత్రాన్ని పఠించాలని భక్తులకు పండితులు సూచిస్తున్నారు. అది కూడా 108 సార్లు పఠించాలని స్పష్టం చేస్తున్నారు. అలా చేయడం వల్ల రోగాలు దరి చేరవని పేర్కొంటారు. వివాహమైన యువతులు ఇలా దీపాలు వెలిగించడం వల్ల వారి కుటుంబానికి మంగళకరమని విశ్వసిస్తారు. కార్తీక పౌర్ణమి రోజు శివాలయాల్లో జ్వాలాతోరణం వెలిగిస్తారు. ఈ తోరణం కింద నుంచి వెళ్లడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని భక్తులు నమ్ముతారు. పాల సముద్రంలో పుట్టిన విషాన్ని పరమేశ్వరుడు మింగిన తర్వాత వేడిని తట్టుకోలేక పోతాడు. ఆ వేడిని తగ్గించమంటూ అగ్ని దేవుడిని పార్వతీ దేవి వేడుకుంటుంది. దాంతో తన సహజ స్వభావాన్ని అగ్ని కొంత మేర తగ్గిస్తాడు. అందుకు అగ్నికి పార్వతి దేవి కృతజ్ఞతలు తెలుపుతుంది.

అందులో భాగంగా కార్తీక పౌర్ణమి రోజు పార్వతి దేవి జ్వాలా తోరణం కడుతుంది. ఆ తోరణం కింద నుంచి భార్యాభర్తలిద్దరు వెళ్లారు.నాటి నుంచి కార్తీక పౌర్ణమి రోజు.. శివాలయాల్లో జ్వాలాతోరణాలు ఏర్పాటు చేయడం అనవాయితీగా మారింది. ఈ రోజు శివాలయాల్లో జ్వాలాతోరణం చూసిన వారికి మరో జన్మ ఉండదని భక్తులు విశ్వసిస్తారు. జ్వాలా తోరణం కాల్చిన తర్వాత మిగిలిన బూడిదను నుదుటిన పెట్టుకుంటే భూత, ప్రేత, పిశాచాల పీడ ఉండదని చెబుతారు. పౌర్ణమి రోజు చంద్రుడు నిండుగా కాంతివంతంగా కనిపిస్తాడు. ఇక ఈ కార్తీక పౌర్ణమి రోజు చంద్రుడి కిరణాలు శరీరం మీద పడితే నరాలు, కళ్లకు సంబంధించిన సమస్యలు దూరమ చంద్రుడు మరింత కాంతివంతంగా ఉంటాడు. ఈ నేపథ్యంలో ఈ రోజు ఐదు నిమిషాల పాటు చంద్రుడి కాంతి శరీరంపై పడేలా భక్తులు చూసుకోవాలని పండితులు సూచిస్తున్నారు.

# ఆదిలోనే అలర్ట్ అవ్వండి

మంచి మార్కులు సాధించాలి, క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగం కొట్టాలి అని అందరూ చెబుతుంటారు. కానీ, ఆర్థిక విషయాల గురించి పిల్లలకు అవగాహన కల్పించరు. దీంతో మంచి కొలువు సాధించి.. రెండు చేతులా సంపాదిస్తున్నా%ొ% మనీ మేనేజ్‌మెంట్‌లో చాలామంది విఫలం అవుతుంటారు. అలా కావొద్దంటే.. ఆర్థిక అక్షరాస్యత తప్పనిసరి. ఈ టిప్స్ ఫాలో అయితే.. మీ కష్టార్జితం వృథాపోకుండా ఉంటుంది. డబ్బు మాత్రమే లక్ష్యం కాకూడదు. కానీ, అనుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు డబ్బు సాధనంగా పనిచేస్తుంది. అందువల్ల ఆఫీసుల్లో ఏవైనా బెనిఫిట్ ప్లాన్స్ ఆఫర్ చేస్తే, అందులో చేరి డబ్బును ఆదా చేసుకోవాలి. కచ్చితంగా ఆ పొదుపు మొత్తం పెద్ద అవసరానికి ఉపయోగపడుతుంది. ఉద్యోగంలో చేరిన తొలినాళ్లలోనే షార్ట్ టర్మ్, లాంగ్ టర్మ్ గోల్స్ పెట్టుకోవాలి. కుటుంబంతో విహారం, కారు, బైకు కొనడం గట్రా స్వల్పకాలిక లక్ష్యాలుగా భావించి అందుకు తగ్గ సేవింగ్స్ చేసుకోవాలి. ఇంటి నిర్మాణం, రిటైర్మెంట్ ప్లాన్ లాంటివి దీర్ఘకాలిక లక్ష్యాలుగా నిర్దేశించుకొని.. ప్రణాళిక మేరకు డబ్బులు కూడబెట్టాలి. మార్కెట్లో చాలామంది ఫైనాన్షియల్ అడ్వైజర్లు అందుబాటులో ఉన్నారు. వారిని సంప్రదించి వచ్చే జీతాన్ని ఎలా ఖర్చు చేయాలో ఒకసారి తెలుసుకోవడం మంచిది. దానివల్ల సంపాదన ప్రారంభమైన



మొదట్లోనే ఫైనాన్షియల్ ప్లానింగ్ అలవాటవుతుంది. పెట్టుబడి, రాబడిపై చిన్నవయసులోనే అవగాహన వస్తుంది.
ఎప్పటికప్పుడు మార్కెట్లో వస్తున్న స్కామర్లపై ఒక కన్నేసి ఉంచాలి. ఎలాంటి బెట్టింగ్, ఈజీ మనీ అవకాశాల వైపు మళ్లకుండా జాగ్రత్తగా ఉండాలి. డబ్బు విషయంలో ఎంత బాధ్యతగా ఉంటే, భవిష్యత్తులో అంత ఆర్థిక క్రమశిక్షణ అలవడుతుంది.

# ఉల్లి కొనుగోలుకు ని'బంధనాలు'



**మార్క్‌ఫెడ్ ద్వారా మూడు రోజులే కొనుగోలు**
**తరువాత బోనస్ అంటూ ప్రకటన**
**ఇ-క్రాప్ సర్టిఫికెట్ ఉంటేనే డబ్బులు**
**ఆందోళనలో రైతులు**

**కర్నూలు,తెలంగాణ దిశ :** ఉల్లి కొనుగోళ్లలో నిబంధనలు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మూడు రోజులే కొనుగోలు చేసింది. ఆ తర్వాత నుంచి వ్యాపారుల దాయాదాక్షిణ్యాలకే వదిలేసింది. క్వింటాలు ఉల్లిని రూ.1,200 కంటే తక్కువకు వ్యాపారులు కొంటే, ఆ వ్యత్యాసపు ధరను తర్వాత భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. మిర్చి విషయంలోనూ ప్రభుత్వం అప్పట్లో ఈ విధంగా హామీ ఇచ్చినా అమలు కాలేదు. అదే విధంగా ఉల్లి బోనస్‌కు సంబంధించి ఏడేళ్ల క్రితం బకాయిలు ఇప్పటికీ చెల్లింపు జరగలేదు. దీంతో, ప్రభుత్వం మాటలపై ఉల్లి రైతుల్లో సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఖరీఫ్‌లో కర్నూలు జిల్లాలో ఉల్లి సాధారణ సాగు 43,817 ఎకరాలు కాగా, ఈ ఏడాది 26,696 ఎకరాల్లో మాత్రమే సాగైంది. ఎకరం విస్తీర్ణంలో ఉల్లి సాగుకు రూ.1.50 లక్షల వరకూ ఖర్చవుతోంది. గతేడాది గరిష్ఠంగా క్వింటాలుకు రూ.3,989 రాగా, ఈ ఏడాది రూ.1,599 మాత్రమే వచ్చింది. గతేడాది కనిష్ఠంగా క్వింటాలుకు రూ.679 రాగా, ఈ ఏడాది రూ.501కి పడిపోయింది. దీంతో, రైతులు రోడ్డెక్కడంతో ప్రభుత్వం స్పందించి క్వింటాలు ఉల్లిని రూ.1200కు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయించింది. ఈ ధర రైతులకు ఏ మాత్రమూ గిట్టుధర కావడం లేదు. ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీ నుంచి మూడో తేదీ వరకు మొత్తం 1,226 టన్నుల ఉల్లిని మాత్రమే మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసింది. నిల్వ చేసుకోవడానికి అవకాశం లేదనే సాకుతో నాల్గో తేదీ నుంచి కొనుగోలు నిలిపివేసింది. వ్యాపారులకే అమ్ముకోవాలని తేల్చి చెప్పింది.

# ట్రంప్ సుంకాలతో ఎదురుదెబ్బలు

## అమెరికన్ వ్యాపారవేత్తల ఆందోళన

వాషింగ్టన్: ఆదాయం పెంచుకోవడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇతర దేశాలపై కొరడా ఝులిపిస్తే.. ఆ దెబ్బ అమెరికా కంపెనీలకే తగులుతోంది. దీంతో అక్కడి వ్యాపార కంపెనీలు లబోదిబోమంటున్నాయి. ఇది అమెరికాకు మేలు చేసేదెల ఉన్నా, ముందుగా తమ ఉనికికే ప్రమాదంగా మారిందన్న ఆందోళన వ్యక్తం అవుతోంది. అగ్రరాజ్యానికి చెందిన మెజారిటీ- కంపెనీలు చైనా నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తుండటమే అందుకు కారణం. చైనా నుంచి అత్యధిక సుంకాలు వసూలు చేయాలని వాషింగ్టన్ భావించగా.. బీజింగ్ కూడా తాము తక్కువ తినలేదని ప్రతీకార సుంకాలు విధించింది. దీంతో అమెరికా కంపెనీలే ఎక్కువగా నష్టపోనున్నాయని షాంఘైలోని అమెరికన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ నిర్వహించిన సర్వేలో తేలింది. ఈ సర్వేలో మొత్తం 254 కంపెనీల్లో మూడోవంతు పాల్గొన్నాయి. చైనాలో కొత్త సుంకాల వల్ల తాము అంచనా వేసిన ఆదాయం తగ్గుతుందని అవి పేర్కొన్నాయి. అయితే, బ్యాంకింగ్, కొన్నిరకాల ఇతర పరిశ్రమలు అమెరికా(÷ూఅ)కు ఎటు-వంటి ఎగుమతులు, దిగుమతులు చేయడం లేదు. ఇలాంటి కంపెనీలు దాదాపు మూడింట ఒక వంతు ఉన్నాయని తెలిసింది. వీటిపై మాత్రమే టారిఫ్‌ల భారం ఉండదు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనా దిగుమతులపై తొలుత అదనంగా 30 శాతం సుంకాలు విధించారు. తర్వాత వాటిని 145 శాతానికి పెంచారు. దీనిపై డ్రాగన్ కూడా దీటుగా స్పందించడంతో పరస్పర సుంకాలపై వెనక్కి తగ్గాలని ఇరు దేశాధినేతలు మేలో నిర్ణయించుకున్నారు. దీంతో చైనా 10 శాతం సుంకాలతో సరిపెట్టింది. నూతన టారిఫ్‌ల ప్రభావం చైనా నుంచి అమెరికాకు ఎగుమతులు చేసే కంపెనీలు, అగ్రరాజ్యం నుంచి కొన్ని రకాల ముడిసరకు దిగుమతి చేసుకొనే కంపెనీలపై పడింది. వీటిలో ముఖ్యంగా రసాయన కంపెనీలు ఉన్నాయని షాంఘై ఛాంబర్ లీడర్స్ తెలిపారు. సుంకాలు మా కార్యకలాపాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని ఆ బృంద అధ్యక్షుడు పేర్కొన్నారు. కొంతకాలంగా అమెరికా, చైనాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతు న్నాయి. సుంకాలు, ఇతర అంశాలపై ఏవిధంగా ముందుకెళ్తున్నారనే విషయంపై స్పష్టత రావడం లేదు. భవిష్యత్తు ప్రణాళికలు రూపొందిం చుకోవాల్సిన కంపెనీలకు ఈ అనిశ్చితి ఒక సవాలుగా మారిందని జెంగ్ వ్యాఖ్యానించారు. ఎమర్జెన్సీ చట్టాల ఆధారంగా సుంకాలు విధిస్తున్నారని, అవి చెల్లుబాటు కావని ఇప్పటికే పలు కోర్టులు అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా తీర్పునిచ్చాయి. ఈ తీర్పులపై ట్రంప్ యంత్రాంగం సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

### మెల్లగా స్వరం మారుస్తున్న ట్రంప్
### భారత్‌తో సుంకాలపై చర్చిస్తామని సూచన

వాషింగ్టన్, : సుంకాలకు సంబంధించి ఇటీవలి వరకు భారత్‌పై ఘాటు- వ్యాఖ్యలు చేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం రోజురోజుకు మారుతోంది. ఆయన మళ్లీ భారత్‌కు చేరువ కావాలని తపిస్తున్నారు. తాజాగా తన సోషల్ మీడియా 'ట్రూత్' వేదికగా మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా, భారత్ మధ్య వాణిజ్య అడ్డంకులను పరిష్కరించడానికి తన పరిపాలన విభాగం ఇండియాతో చర్చలు కొనసాగిస్తోందని పేర్కొన్నారు. ఈ అంశంపై తన మిత్రుడైన భారత ప్రధాని మోదీతో వచ్చే కొన్ని వారాల్లోనే మాట్లాడేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు- తెలిపారు. ఈ చర్చలు రెండు గొప్పదేశాలకు మంచి ఫలితాలు ఇస్తాయని ఆశిస్తున్నట్లు- వెల్లడించారు.
రష్యా నుంచి అధికస్థాయిలో భారత్ చమురును దిగుమతి చేసుకొని విదేశాలకు అమ్ముతూ ఇటీవలి వరకు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సుకు ఇటీ-వల హాజరైన ప్రధాని మోదీ అక్కడ చైనా అధ్యక్షుడు అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీ-లు నిర్వహించారు. ఈ భేటీ- అనంతరం చైనా చీకటి వలయంలో భారత్ చిక్కుకున్నట్లు- ట్రంప్ విమర్శలు గుప్పించారు. అనంతరం
కొన్ని గంటల్లోనే తన స్వరం మార్చారు. భారత్, అమెరికా మధ్య బంధం చాలా ప్రత్యేకమైందని పేర్కొన్నారు. దాని గురించి ఆందోళన చెందనక్కర్లేదని తెలిపారు. ప్రధాని మోదీని ప్రశంసలతో ముంచెత్తారు. మోదీ గొప్ప ప్రధానమంత్రి అని కొనియాడారు. మోదీకి తానెప్పుడూ స్నేహితుడినన్నారు.

# జీవితం క్షణ భంగురం

**తిరుమల,తెలంగాణ దిశ :**మానవ జన్మ ఎక్కువ కాలం ఉండదు. ఈజీవితం బుద్బుదప్రాయం. ఉన్న కొద్ది కాలంలో మంచి అనిపించుకునేలా జీవించాలి. ఇలాంటి జీవితాన్ని ఆనందమయం చేసుకోవాలి. ఆదర్శంగా జీవితం గడపాలి. ఉన్న కాలాన్ని సక్రమంగా వాడుకోవాలి. 'దుర్లభో మానుషోదేహః' శరీరం లభించడమే చాలా కష్టం, 'దేహినాం క్షణ భంగురః' లభించినది ఒక క్షణమంత కూడా ఉండదు. ఇది మెరుపు కంటే కూడా ప్రమాదకరమైనది. మెరుపు ఎట్లా ఐతే పోయేదో, ఆ వెలుతురును పట్టించుకోం, అట్లానే శరీరం పోయేది అని తెలిసి కూడా దానికోసం ఎన్ని తప్పుడు పనులు చేస్తున్నామో గుర్తించాలి. పోయేదే అయినా ఇది పోయేది అని అనుకోనివ్వటం లేదు. కేవలం శరీరంకోసం బ్రతుకుతున్నాం అంటే ఇది ఎంత ప్రమాదమైనదో గుర్తించాలి. మెరుపు పోతుందని తెలుసు మనం వాడుకోం, అందుకే ఆ మెరుపే నయం. ఇట్లాంటి స్థితిలో మనం ఎన్నో జన్మలలో ఒకసారి మనిషి అయినప్పుడు దైవాన్ని గురించి ఆలోచించి, ఆ జ్ఞానాన్ని ఇచ్చే మహానుభావులని విశ్వసించి వారికి తగినట్లు బ్రతికగలిగితే, అట్లాంటి జన్మ కోటికి ఒకట్టైనా ఉంటుందో లేదో అని చెప్పవచ్చు. 'తత్రాపి దుర్లభం మన్యే వైకుంఠ ప్రియదర్శనం' మానవ జన్మలభించడమే గొప్ప అంటే, అట్లాంటి మానవ జన్మలో దైవాన్ని గుర్తించి బ్రతకడం, వైకుంఠ ప్రియులైన వారి దర్శనం లభించడం, వారి అభిమానం పొందటం ఎంత కష్టమో అనేది ఋషివాక్కు!! పరాశర మహర్షి వంటి వారికే అట్లా అనిపిస్తే ఇక మన గురించి ఆలోచించాలి. ఇవన్నీ మనిషికి చెప్పాల్సొచ్చింది, అది చెప్పడానికే రామావతారం. పురాణాలు, ఇతిహాసాలు అన్నీ మానవుడు సన్మార్గంలో నడవడానికి ఉపయోగపడేవే. వాటిని చదివి ఆ మార్గంలో పయనించినప్పుడే మానవ జన్మకు సార్థకత ఉంటుంది. మన జీవితం సుఖమయంగా సాగుతుంది.

# నేపాల్‌లో చిక్కుకున్న భారత పర్యాటకులు

## పర్యాటకులను కూడా వదలని ఆందోళనకారులు

ఖాట్మండ్,: నేపాల్‌లో జెన్-జడ్ నిరసనలు హింసాత్మక పరిస్థితులను సృష్టించాయి. ప్రభుత్వ, ప్రైవేటు- ఆస్తులకు ఆందోళనకారులు నిప్పటించారు. పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్ పైనా వారు దాడికి దిగారు. దాంతో అందులో బస చేస్తోన్న భారత పర్యాటకురాలు ఉపాసన గిల్ తనకు సహాయం చేయాలంటూ భారత ప్రభుత్వానికి మొరపెట్టుకున్నారు. దానికి సంబంధించిన వీడియో ఆన్‌లైన్‌లో వైరల్‌గా మారింది. ఉపాసన గిల్ వాలీబాల్ లీగ్ కోసం నేపాల్ వచ్చారు. నిరసనలతో పొఖారా ప్రాంతంలో ఉన్న హోటల్‌లో చిక్కుకుపోయాను. తొలుత నేను బస చేసిన హోటల్‌కు నిప్పంటించారు. నా వస్తువులన్నీ అందులోనే ఉండిపోయాయి. దాడి సమయంలో నేను స్పాలో ఉన్నాను. కొందరు నిరసనకారులు పెద్దపెద్ద కర్రలతో నా వెనకే దూసుకొచ్చారని గిల్ వాపోయారు. వారినుంచి ఎలాగోలా ప్రాణాలు కాపాడుకున్న ఆమె.. సహాయం కోసం భారత ప్రభుత్వాన్ని అర్థించారు. ప్రస్తుతం పరిస్థితులు ఏమాత్రం బాగా లేవని, రోడ్డుపై ఎక్కడ చూసినా మంటలే కనిపిస్తున్నాయని వెల్లడించారు. వారు పర్యాటకులను కూడా వదలడం లేదు. ఎలాంటి ఆలోచన లేకుండా ప్రతిదీ తగలబెడుతున్నారు. పరిస్థితి ఎలా ఉంటుందో తెలియడం లేదు. నాతోపాటు- చాలామంది సహాయం కోసం ఎదురుచూస్తున్నారని ఆమె పేర్కొన్నారు. ఇక ఇప్పటికే నేపాల్ లో ఉన్న భారతీయులను స్వదేశానికి రప్పించేందుకు భారత ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. అక్కడి రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లను వెల్లడించింది. అలాగే పరిస్థితులు చక్కబడేవరకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని సూచించింది. ప్రస్తుతం ఉన్నచోటే ఉండాలని, వీధుల్లోకి రావొద్దని హెచ్చరించింది. ఎప్పటికప్పుడు స్థానిక యంత్రాంగం ఇచ్చే సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని కోరింది. నేపాల్ సరిహద్దుల్లో ఉన్న ఉత్తర్‌ప్రదేశ్‌లోని సొనౌలీ ప్రాంతం మీదుగా భారతీయ పర్యాటకులు తిరిగి స్వదేశానికి వస్తున్నారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో వారంతా తమ పర్యటనను అర్ధంతరంగా ముగించుకొన్నారు. ఇదిలాఉంటే.. చర్చల ద్వారా శాంతియుత పరిష్కారానికి కృషి చేయాలని అధ్యక్షుడు, ఆర్మీ నిరసనకారులను కోరింది. ప్రస్తుతం అక్కడ ఆర్మీ కర్ఫ్యూ ప్రకటించింది. నేపాల్ వెంబడి ఉన్న సరిహద్దు ప్రాంతాల్లో భారత్ భద్రతను కట్టుదిట్టం చేసింది

# ప్రపంచానికే ఆదర్శం



సర్వమానవ సంక్షేమమే లక్ష్యంగా సాగిపోతున్న కేరళ జనాభా సవాళ్లను ఎదుర్కోవడంలో ప్రపంచానికే ఆదర్శంగా నిలవడం ముదావహం. దేశమంటే మట్టికాదోరు.. దేశమంటే మనుషులోరు అన్న మహాకవి గురజాడ మాటలను ఆచరణలో పెట్టేందుకు మార్క్సిస్టు యోధుడు ఇఎంఎస్ నంబూద్రిపాద్ మొదలు.. అచ్యుతానందన్, పినరయి విజయన్ వరకూ%ొ% లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వాలు సాగించిన కృషి%ొ% నేడు కేరళ మోడల్‌గా ప్రశంసలందుకుంటోంది. ప్రపంచంలోనే అత్యధిక జనాభాతో.. అందునా యువత అత్యధికంగా ఉండటం దేశ అభివృద్ధికి తోడ్పడేదే! ఈ అవకాశాన్ని మానవ సంక్షేమానికి, దేశ సౌభాగ్యానికి ఎలా వినియోగించవచ్చో కేరళ నిరూపిస్తోంది. అత్యధిక జనాభా కంటే విద్య, వైద్య నైపుణ్యాలున్న యువతే ఆస్తి అని చాటిచెప్పింది. ప్రపంచంలోనే అతి తక్కువ శిశు మరణాలు నమోదులో%ొ% అత్యంత అభివృద్ధి చెందిన అమెరికాను అధిగమించడం కేరళ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం. శాంపుల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (ఎస్ఆర్ఎస్) నివేదిక ప్రకారం మనదేశంలో ప్రతి వెయ్యి శిశు జననాలకు శిశు మరణాల రేటు (ఐఎంఆర్) 25గా ఉంది. ప్రపంచంలోనే అత్యాధునిక వైద్య సదుపాయాలున్న అమెరికాలో 5.6 శాతం శిశు మరణాలు నమోదవుతుంటే, కేరళలో ఐదు శాతమే నమోదవుతున్నాయి. నవజాత శిశువుల మరణాల రేటు (నియోనేటల్ మోర్టాలిటీ) దేశ సగటు 18 శాతం కాగా, కేరళలో 4 శాతం కంటే తక్కువ. రాష్ట్ర అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడుతూ, నిధుల విడుదలకు మోకాలడ్డుతున్న మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వాన్ని సవాలు చేస్తూనే.. ఈ ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశాల్లోని కార్పొరేట్, ప్రైవేటు వైద్యరంగం అందించే సేవలను అధిగమించడం హర్షనీయం. దేశంలోనే అత్యధికంగా 37 శాతం శిశు మరణాలు బిజెపి పాలిత మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో నమోదయ్యాయి. మోడీ ప్రభుత్వం అత్యధిక నిధులు కట్టబెడుతున్నా%ొ% బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఆరోగ్యం అథమంగానే ఉంటోంది. నీతి ఆయోగ్ నివేదికల ప్రకారమే 2019- 20 నుంచి అన్ని ఆరోగ్య సూచీలలో కేరళ దేశంలో అగ్రస్థానంలో ఉంది. అభివృద్ధి చెందిన దేశాలతో సమానంగా లేదా అంతకంటే ఎక్కువగా ఉంది. కేరళ సగటు ఆయుర్దాయం 77 కాగా, ప్రపంచ సగటు 73.5. కేరళలో ప్రసవ సమయాలలో మరణాల రేటు లక్షకు 46 మాత్రమే. జాతీయ సగటు 97. 2018లో నిఫా వ్యాప్తిని 10 రోజుల్లోనే రాష్ట్రప్రభుత్వం నియంత్రించగలిగింది. కరోనాను నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం మొదలు, బిజెపి పాలిత రాష్ట్రాలన్నీ చేతులెత్తేయగా, కేరళ ప్రభుత్వం, అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి శైలజ టీచర్ చేసిన అవిరళ కృషిని ఐక్యరాజ్యసమితి ప్రత్యేకంగా అభినందించింది. 2021, 2022లో సంతానోత్పత్తి రేటు (టిఎఫ్ఆర్) దేశంలో 2 శాతంగా ఉండగా, 2023లో 1.9 శాతానికి తగ్గింది. జననాలు, మరణాలు ఒకదానికి ఒకటి సమతుల్యం చేసుకుంటే జనాభా స్థిరత్వం ఏర్పడుతుంది. ప్రస్తుతం యువ జనాభా అత్యధికంగా ఉన్న దేశాల్లో మనదేశం ముందుంది. ఆరోగ్యకరమైన, చదువుకున్న, నైపుణ్యం కలిగిన జనాభా నుంచే డెమోగ్రాఫిక్ డివిడెండ్ (జనాభా లాభం) లభిస్తుందని, యువజనాభా ఉత్పాదక శక్తిగా ఆవిర్భవిస్తుందని కేరళ మోడల్ నిరూపించింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాలు%ొ% భూపంపిణీ, అధునాతన విద్య, వైద్యరంగం, మానవాభివృద్ధి కోసం పడిన తపన నేడు సత్ఫలితాలనిస్తోంది. మహిళలు, పిల్లలపై కేంద్రీకరణ%ొ% ప్రజల సామర్థ్యాన్ని విపరీతంగా పెంచింది. ఇటీవల డిజిటల్ లిటరసీని సైతం సాధించి దేశానికి, ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచింది. ప్రజల కోసం అధికారాన్ని వెచ్చిస్తే, స్థానిక సంస్థలకు అధికారాలిస్తే సాకారమయ్యే అద్భుతాలను ఆవిష్కృతం చేసి, దేశానికే రోల్ మోడల్‌గా ఆవిర్భవించింది. విద్య, వైద్యరంగంలో అద్భుతాలతో 16 శాతంగా పెరిగిన వృద్ధ జనాభా సంక్షేమం కోసం ఈ ఏడాది ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్స్ కమిషన్, కేరళ రాష్ట్ర వృద్ధుల విధానం దేశానికి దిశానిర్దేశం చేసేవే.
కేరళలాంటి రాష్ట్రాలకు అవసరమైన నిధులివ్వాల్సిన కేంద్రం%ొ% గవర్నర్లు, జిఎస్‌టి నిధులను తొక్కిపెట్టడం తదితర రూపాల్లో అభివృద్ధికి అడుగడుగునా అడ్డుపడటం క్షమార్హం కాదు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లో మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు, మతాల మధ్య, కులాల మధ్య కుంపట్లు పెట్టడం, మణిపూర్ మాదిరిగా మంటలు రేపడం దేశ సర్వతోముఖాభివృద్ధికి ఆటంకం. కేరళ మోడల్‌ను అనుసరించే విధానాలను రూపొందించడం, తగిన వనరులను వినియోగించడం దేశ సర్వతోముఖాభివృద్ధికి అత్యవసరం.

## యూరియా కోసం రైతుకు తప్పని నిరీక్షణ..

**రాజంపేట,తెలంగాణ దిశ :**యూరియా కోసం రైతులకు నిరీక్షణ తప్పడం లేదు. ఉదయం 5 గంటల నుండి సొసైటీల ముందు రైతులు.. క్యూలైన్లో చెప్పులను పెట్టి ఏడు ఎనిమిది గంటలు లైన్లో నిరీక్షణ చేసినా రైతుకు ఫలితం దక్కడం లేదు. వచ్చే కొద్దిపాటి యూరియా కోసం వారు బారులు తీరడంతో అధికారులు పోలీసుల సహాయంతో రైతుకు ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేయడం జరుగుతు ంది. వచ్చిన యూరియా అందరికీ సరిపోక రైతులు వెను తిరగాల్సి వస్తుంది. అదే పరిస్థితి ప్రస్తుతం రాజంపేట మండలం తలమడ్ల గ్రామంలో ఎదురైంది. వచ్చిన లారీని అడ్డుకొని రైతులు తమకు సరిపడ్డ యూరియా అందటం లేదని నిరసన వ్యక్తం చేశారు. సుమారు 1000 మంది రైతులు క్యూ లైన్‌లో వేచి ఉంటే కేవలం రెండు వందల బస్తాల యూరియా రావడంతో రైతులు నిరాశకు గురవుతున్నారు. పంటలకు సరైన సమయంలో యూరియా అందక పంట దిగుబడి తగ్గిపోతుందని రైతులు వాపోతున్నారు. ఒక్క బస్తా యూరియా కోసం ఏడు ఎనిమిది గంటలు లైన్లో వేచి చూస్తే అప్పుడు యూరియా దొరుకుతుందని రైతులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని వేడుకుంటున్నారు.



# లోకేష్ పేరును వదలని సైబర్ చీటర్స్



**విజయవాడ,తెలంగాణ దిశ :**సైబర్ నేరాల తీరు మారుతోంది. ఇప్పటివరకు సామాన్యులే టార్గెట్ అయ్యేవారు. ఇప్పుడు సెలబ్రిటీలను సైతం వదలడం లేదు. వీఐపీల పేర్లు, ఫోటోలు వాడుకొని సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. మొన్న మధ్యన రాయలసీమ జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యే ఒకరిని టార్గెట్ చేసి కోటి రూపాయలకు పైగా వసూలు చేసినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా ఏపీ మంత్రి నారా లోకేష్ పేరుతో 57 లక్షల రూపాయలు కొల్లగొట్టేశారు. దీంతో రంగంలోకి దిగిన ఏపీ పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ఇది సంచలన అంశంగా మారింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.ఏపీకి చెందిన ఓ వ్యాపారికి.. మంత్రి నారా లోకేష్ ప్రొఫైల్ పిక్చర్ గా ఉన్న ఓ వాట్సప్ నుంచి సమాచారం వచ్చింది. కీలకమైన ప్రాజెక్టులకు డబ్బు అవసరం ఉందని చెప్పి.. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ద్వారా ఫోన్ కాల్ చేసి అచ్చంగా మంత్రిగా మాట్లాడారు. అయితే అది నిజమేనని భావించిన సదరు వ్యాపారి పలు విడతల్లో 57 లక్షల రూపాయల వరకు అలా బెదిరించిన వ్యక్తులకు పంపించాడు. చివరకు ఇది మోసంగా భావించి ఏపీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు రంగంలోకి దిగి ప్రధాన నిందితుడు రాజేష్ ను అదుపులోకి తీసుకున్నారు. ఆయన ఇచ్చిన సమాచారంతో హైదరాబాదులో సాయి శ్రీనాథ్, సుమంత్ అనే ఇద్దరు వ్యక్తులను హైదరాబాదులో అరెస్టు చేశారు. ఈ ఘటన వెనుక పెద్ద ముఠా హస్తం ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రధానంగా ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలను టార్గెట్ చేస్తున్నట్లు స్పష్టం అవుతుంది.కొద్ది రోజుల కిందట ఖమ్మం జిల్లా టిడిపి నేతలను ఇలానే సైబర్ నేరగాళ్లు దోచుకున్నారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేరుతో వాట్సాప్ కాల్ చేశారు. తెలంగాణలో పార్టీ అభివృద్ధికి నిధులు కావాలని.. అందుకు విరాళాలు అందించాలని కోరడంతో కొందరు నేతలు నగదు పంపించారు. అదే సమయంలో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. ఆ ఎన్నికల్లో బీఫారాలు కావాలంటే కొంత మొత్తం చెల్లించాలని కోరడంతో.. రెండోసారి కూడా సదరు నేతలు నగదు జమ చేశారు. అమరావతి వస్తే పార్టీ అధినేత చంద్రబాబుతో బీఫారాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. విజయవాడలో వారి పేరుతో హోటళ్లు కూడా బుక్ చేశారు. దీంతో ఇది నిజమని నమ్మిన నేతలు విజయవాడ వెళ్లి హోటల్లో దిగారు. అయితే అక్కడ బిల్లు చెల్లించే క్రమంలో వివాదం జరిగింది. తాము సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డామని గుర్తించిన సదరు నేతలు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెనుకడుగు వేశారు. బయటకు చెబితే పరువు పోతుందని భావించారు. ఇంకోవైపు రాయలసీమ జిల్లాకు చెందిన టిడిపి ఎమ్మెల్యే ఒకరు హైదరాబాదులో ఇలానే సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. అయితే ఇప్పుడు మంత్రి నారా లోకేష్ పేరు చెప్పి సైబర్ నేరానికి పాల్పడడంతో పోలీసులు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు.

# ఇండిగోకు కేంద్రం షాక్..




ముంబై,: ఇటీవల 2 వేలకు పైగా విమానాలు రద్దు కావడంతో తలెత్తిన సంక్షోభం దృష్ట్యా.. కేంద్రం ఇండిగో సంస్థకు భారీ షాక్ ఇచ్చింది. ఇండిగో సంస్థ 10 శాతం విమానాలను తగ్గించాలని కఠిన ఆదేశాలు జారీ చేసింది. దీంతో రోజుకు 200 ఇండిగో విమానాలు నిలిచిపోనున్నాయి. అయినప్పటికీ.. అన్ని మార్గాల్లో తమ సర్వీసులను కొనసాగిస్తామని ఇండిగో ప్రకటించింది.దేశంలో అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో సంస్థకు సంబంధించి.. ఇటీవల నెలకొన్న సంక్షోభం ఇప్పుడిప్పుడే సద్దుమణిగిపోతోంది. పూర్తి స్థాయిలో కార్యకలాపాలను సాగించేందుకు.. అన్ని రకాలుగా కృషి చేస్తున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇక వేలాది విమానాలు రద్దు కావడం వల్ల.. వేల మంది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడటం, కేంద్ర ప్రభుత్వం తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్న వేళ.. కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇటీవల 2000కు పైగా విమానాలు రద్దు కావడంతో తలెత్తిన తీవ్ర సంక్షోభం వేళ.. కేంద్ర పౌరవిమానయాన శాఖ.. ఇండిగో సంస్థపై కొరఢా ఝళిపించింది. ఇండిగో సంస్థ తమ మొత్తం కార్యకలాపాల్లో 10 శాతం తగ్గించుకోవాలని కేంద్ర ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేసింది కొద్ది రోజులుగా ఇండిగో విమానాలు భారీ సంఖ్యలో రద్దు కావడం, ఆలస్యం కావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీనికి ప్రధానంగా సిబ్బంది రోస్టర్ నిర్వహణలో లోపాలు.. కొత్త ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ నిబంధనలకు అనుగుణంగా.. ఇండిగో సంస్థ తమ షెడ్యూల్‌ను మార్చుకోకపోవడం కారణమని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు.. స్వయంగా పార్లమెంటు వేదికగా ప్రకటన చేశారు. ఇండిగో సంస్థ కార్యకలాపాలను మళ్లీ సాధారణ స్థితికి తీసుకురావడానికి.. విమానాల రద్దులను తగ్గించడానికి ఈ 10 శాతం సర్వీసుల కోత అవసరమని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ భావించింది. అయితే డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మాత్రం.. మొదట్లో 5 శాతం సర్వీసుల కోత విధించాలని నిర్ణయించగా.. తాజాగా విమానయాన మంత్రిత్వ శాఖ మాత్రం దాన్ని 10 శాతానికి పెంచింది.ఇండిగో సంస్థ.. రోజుకు దాదాపు 2200 విమానాలను నడుపుతుంది. తాజా 10 శాతం తగ్గింపు వల్ల.. 200కు పైగా విమానాలు రద్దు కానున్నాయి. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశాలను పాటించాలని ఆదేశిస్తూ.. ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్‌ను మంత్రిత్వ శాఖ కార్యాలయానికి పిలిపించారు.కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఆదేశించిన 10 శాతం సర్వీసుల కోతకు తాము కట్టుబడి ఉన్నామని.. ఇండిగో సంస్థ ఎక్స్ వేదికగా ఒక ప్రకటన చేసింది. ఈ 10 శాతం విమానాలు నడవకపోయినా.. ఇండిగో సంస్థ తన అన్ని గమ్యస్థానాలను మునుపటిలాగే కవర్ చేస్తుందని తెలిపింది.కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇండిగో సంస్థకు పలు ఆదేశాలు జారీ చేసింది. విమాన టికెట్ ధరలపై పరిమితిని పాటించడం.. విమాన ప్రయాణికుల సౌకర్యం కోసం చర్యలు తీసుకోవడం.. డిసెంబర్ 6వ తేదీ వరకు ప్రభావితమైన విమానాలకు 100 శాతం రీఫండ్‌లు పూర్తి అయ్యాయని ఇండిగో ధృవీకరించింది. మిగిలిన రీఫండ్‌లు, లగేజీని అప్పగించే ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కఠినమైన సూచనలు జారీ చేశారు.ఈ విషయంలో దర్యాప్తు ప్రారంభించి విమానయాన సంస్థ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు పార్లమెంట్‌లో ప్రకటించారు. దర్యాప్తులో తేలిన విషయం ఆధారంగా ఇండిగో సంస్థపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. మరోవైపు.. ఈ సంక్షోభం నుంచి బయటపడడానికి తమ కార్యకలాపాలు ఇప్పుడు గాడిన పడుతున్నాయని ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్ అంతకుముందు ట్వీట్ చేసినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది.

# పాత జిల్లాలోనే కలిపేయండి

**కర్నూలు,తెలంగాణ దిశ :**ఏపీలో జిల్లాల పునర్విభజన వేళ డోన్ నియోజకవర్గ ప్రజలు తమను నంద్యాల నుంచి కర్నూలు జిల్లాలో కలపాలని కోరుతున్నారు. వైద్య, ఉపాధి అవసరాలకు కర్నూలు దగ్గరగా ఉండటమే దీనికి కారణం. గతంలోనూ కర్నూలు జిల్లాలోనే ఉన్న డోన్ వాసులు, ఈ మార్పు తమకు సౌకర్యంగా ఉంటుందని చెబుతున్నారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి కూడా ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.ఏపీలో కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, జిల్లాల పునర్విభజన, మండలాల పునర్విభజనలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో తాజాగా మరో డిమాండ్ తెరపైకి వచ్చింది. తమను నంద్యాల జిల్లా నుంచి తీసుకెళ్లి కర్నూలు జిల్లాలో కలిపేయాలని డోన్ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు. డోన్ నియోజకవర్గం నంద్యాల జిల్లాలో కలపడాన్ని అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. గతంలో డోన్ నియోజకవర్గం కర్నూలు జిల్లాలోనే ఉండేది. దీంతో డోన్ వాసులు చిన్న అనారోగ్య సమస్యలు వచ్చినా, అత్యవసర పరిస్థితులు ఎదురైనా కర్నూలులోని పెద్దాసుపత్రికి వెళ్లేవారు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగులు, నిరుద్యోగులు, కూలీలు కూడా ఉపాధి, ఉద్యోగాల కోసం కర్నూలుకు వెళ్లేవారు. అయితే గత ప్రభుత్వ హయాంలో నంద్యాల జిల్లాలోకి విలీనం అయింది. ఈ మార్పును వ్యతిరేకిస్తూ అప్పట్లోనే ప్రజలు అనేక విజ్ఞప్తులు చేశారు.డోన్ నియోజకవర్గ ప్రజలు తమ ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు. 2 లక్షలకు పైగా ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో, డోన్ పట్టణ, మండలాల నుంచి 90 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. చారిత్రాత్మకంగా, డోన్ ప్రాంతం నుంచి ఎన్నికైనవారు రాష్ట్ర, కేంద్ర మంత్రి పదవులు కూడా చేపట్టారు. ప్రస్తుతం, డోన్‌ను కర్నూలు జిల్లాలో కొనసాగించాలని కోరుతున్నారు. డోన్ నుంచి కర్నూలుకు హైవే మార్గంలో కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉంది.. 50 నిమిషాల్లోనే చేరుకోవచ్చు. అయితే నంద్యాల జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 90 కిలోమీటర్లు ప్రయాణించి గంట నుంచి గంటన్నర సమయం పడుతుంది.డోన్ ప్రాంత ప్రజలు వైద్య అవసరాల కోసం, ఉపాధి అవకాశాల కోసం కర్నూలు దగ్గరగా ఉండటంతో అక్కడికే వెళ్లడం సౌకర్యంగా ఉందంటున్నారు. నంద్యాలకు కేవలం జిల్లా అధికారులతో పనులుంటేనే వెళ్తున్నారట. ప్యాపిలి మండల ప్రజలు కూడా తమ ప్రాంతాన్ని కర్నూలు జిల్లాలోనే ఉంచితే బాగుంటుందని అభిప్రాయపడుతున్నారు. డోన్, ప్యాపిలి ప్రాంతాల ప్రజల్లో 95 శాతం మందికి పైగా తమ ప్రాంతాలను కర్నూలు జిల్లాలోనే కొనసాగించాలని కోరుతున్నారు.డోన్ ప్రజలు కోరుకున్నట్లుగానే కర్నూలు జిల్లాలో విలీనం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి తెలిపారు. 2024 ఎన్నికల సమయంలో కూడా హామీ ఇచ్చామని.. ఇప్పటికే జిల్లాల పునర్విభజనపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం, ముఖ్యమంత్రికి సైతం లేఖను అందజేశామని చెప్పారు. ఈ ఏడాది డిసెంబర్ లోపు ఈ జిల్లాల పునర్విభజన ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నారు. మరి డోన్‌వాసుల రిక్వెస్ట్‌ను పరిగణలోకి తీసుకుంటారలో లేదో చూడాలి. మరి డోన్ ప్రజల రిక్వెస్ట్‌పై ప్రభుత్వం, కేబినెట్ సబ్ కమిటీ ఎలా స్పందిస్తుందో చూడాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని డోన్‌వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఒంగోలు పట్టణ వ్యాపారుల లబోదిబో

## వరదలతో పూర్తిగా కొట్టుకుపోయిన సరుకులు

## ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు


**ఒంగోలు,తెలంగాణ దిశ :** మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు ఉమ్మడి ప్రకాశం జిల్లాను అతలాకుతలం చేశాయి. అన్నదాతలతో పాటు, సామాన్యులు కూడా దెబ్బతిన్నారు. ముఖ్యంగా వీధి వ్యాపారుల అవస్థలు చెప్పలేం. ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథగా ఉంది. చిరు వ్యాపారులను తుఫాన్ వర్షం నిలువునా ముంచింది. జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో ఊహించని విధంగా భారీఎత్తున వరద నీరు ముంచెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కిరణా సామగ్రి విక్రయదారులు, దర్జీలు, తినుబండరాలు అమ్మేవారు, మోటారు మెకానిక్‌లు ఇలా చేతివృత్తులదారులందరూ తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు. అల్పపీడనం, అనంతరం మొంథా తుపాను ప్రభావంతో గత పది రోజులుగా కురిసిన భారీ వర్షాలతో వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగాయి. వర్షాలకు జన సంచారం తగ్గి అమ్మకాలు సాగక చిరు వ్యాపారులకు పూట గడవని పరిస్థితి నెలకొంది. తొలుత ఎలాంటి వరద లేకపోవడంతో ఎప్పుడూ వచ్చే మాదిరి వరద నీరు వచ్చి పోతుందని పెద్దగా జాగ్రత్తలు తీసుకోలేదు. చాలామంది సామగ్రి సర్దుకోలేదు. చాలామంది దుకాణం ఒకచోట, నివాసం మరోచోట ఉండటంతో సామగ్రిని భద్రపరచుకోలేకపోయారు. భారీఎత్తున వరద నీరు చుట్టుముట్టేయడంతో దుకాణాల్లో నీరు చేరింది. దీంతో సామగ్రి పూర్తిగా తడిసిపోయి ఎందుకూ పనికిరాకుండాపోయాయి. వరదతో దుకాణంలో బురద మేటలు వేసిందని, దీంతో తీవ్రంగా నష్టపోయినట్లు వివరించారు. వస్తువులను తయారు చేసే చిన్న ఖార్ఖానాలను వరద నీరు ముంచెత్తడంతో వారంతా నష్టపోయారు. ప్రధానంగా ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువను ఆనుకుని ఉన్న కాలనీల్లో చిరు వర్తకులకు తీవ్ర నష్టం ఎదురైంది. నష్టాన్ని పరిశీలించి తమకు సాయం చేయాలని వారంతా కోరుతున్నారు. ఒంగోలు నగరం మొంథా దెబ్బకు జలవిలయాన్ని సృష్టించంది. నగరం మొత్తం నీట మునిగింది. దీంతో చిన్నాచితక వ్యాపారాలు చేసేవారి సామాగ్రి నీట మునిగిపోవడం లేదా కొట్టుకుపోవడం జరిగింది. బలరాం కాలనీకి వెళ్లే దారిలో వంతెన వద్ద సమోసాలు హోల్‌సేల్‌గా విక్రయించే దుకాణంలో పిండి బస్తాలు తడిచిముద్దయి పనికి రాకుండాపోయాయి. ఇదే ప్రాంతంలో పాత సామగ్రి కొనుగోలు దుకాణంలోని మొత్తం సరకు కొట్టుకుపోయినట్లు వ్యాపారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు వర్షం కురిసినా మోకాలి లోతున నీళ్లు వస్తుంటాయని, ఆమేర జాగ్రత్త పడతామని ఈసారి ఊహించని విధంగా వరద ముంచేసిందని ఓ కిరాణా వ్యాపారి వాపోయారు. ఇటీవల కాలంలో ఇంత వరద తామెప్పుడూ చూడలేదని పలువురు కన్నీటిపర్యంతమయ్యారు.

# విచారణ షురూ...



**కడప,తెలంగాణ దిశ :**ఏదైనా నేరంతో తమకు సంబంధం లేకపోతే నిష్పక్షపాతంగా విచారణ జరిపించుకోవచ్చని ఎక్కువ మంది సూచిస్తారు. తమ తప్పు లేదన్నప్పుడు విచారణ ఎలా చేస్తే తమకెందుకులే అన్నట్టు ఉంటారు. కానీ మాజీ మంత్రి వైయస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో నిందితులు మాత్రం తమపై విచారణ నిలిపివేయాలని పిటిషన్లు దాఖలు చేయడం విశేషం. 2019 మార్చి 15న దారుణ హత్యకు గురయ్యారు వివేకానంద రెడ్డి. అప్పట్లో సిఐడి విచారణకు ఆదేశించింది టిడిపి సర్కార్. అయితే ఎట్టి పరిస్థితుల్లో సిబిఐ విచారణ చేయాల్సిందేనని పట్టుపట్టారు అప్పటి విపక్షనేత జగన్మోహన్ రెడ్డి. టిడిపి సర్కార్ సిబిఐ విచారణకు ఆదేశించింది. జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చారు. సిబిఐ విచారణ అవసరం లేదని తేల్చేశారు. చివరకు వివేకానంద రెడ్డి కుమార్తె సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో సిబిఐ దర్యాప్తు అనివార్యం అయింది. గత ఐదేళ్లలో సిబిఐ విచారణ కొనసాగింది. దర్యాప్తు ముగించినట్లు సిబిఐ కోర్టుకు నివేదించింది. కానీ అసలు విచారణ జరపకుండా ముగిసింది అని చెప్పడం సరికాదని వివేక కుమార్తె సునీత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కింది కోర్టులో కేసు విచారణను మళ్లీ ప్రారంభించాలని పిటీషన్ దాఖలు చేయడం విశేషం.నాంపల్లి సిబిఐ కోర్టులో సునీత పిటిషన్ దాఖలు చేశారు. మళ్లీ విచారణ ప్రారంభించాలని సిబిఐకి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అయితే ఇప్పటికే సిబిఐ విచారణ ముగిసిందని.. మరోసారి ప్రారంభించవద్దని ఈ హత్య కేసులో నిందితులు కౌంటర్ పిటిషన్లు వేశారు. ఒక్క అవినాష్ రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్ రెడ్డి తప్ప అందరూ పిటిషన్లు దాఖలు చేశారు. వారికి కూడా గడువు ఇచ్చింది కోర్ట్. తప్పకుండా వారుసైతం విచారణ వద్దని కచ్చితంగా పిటిషన్లు దాఖలు చేస్తారు. ఎందుకంటే వివేకానంద రెడ్డి హత్య కేసులో తమ ప్రమేయం లేదని.. అదంతా కుటుంబ వ్యవహారమని? ఆస్తి కోసమే సునీత, ఆమె భర్త చేయించారని సాక్షిలో ప్రత్యేక కథనాలు రాయించారు. ఆపై గత ఐదేళ్లుగా సిబిఐ విచారణకు వైసీపీ ప్రభుత్వం సహాయ నిరాకరణ చేసింది. అప్పటి సాక్షాలను సైతం చెరిపేసినట్లు వార్తలు వచ్చాయి. ఇవన్నీ ముగిసిన తర్వాత ఇప్పుడు విచారణ ఎందుకన్నది ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితుల అభిప్రాయం.ప్రస్తుతం నాంపల్లి సిబిఐ కోర్టు ఆదేశాల కోసం యావత్ తెలుగు రాష్ట్రాలు ఎదురుచూస్తున్నాయి. ఒకవేళ కోర్టు సిబిఐ విచారణ మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాలని ఆదేశిస్తే సంచలనమే. లేదు ఇప్పటివరకు జరిగిన విచారణ ఓకే అని చెప్పినా సంచలనమే. మరో సారి విచారణ అంటే మాత్రం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఇబ్బంది కరమే. ఎందుకంటే సిబిఐ విచారణకు ఏపీ పోలీస్ శాఖ సంపూర్ణంగా సహకరిస్తుంది. విచారణలో సంచలన అంశాలను బయటపెట్టి అవకాశం ఉంది. స్వేచ్ఛగా విచారణ చేపట్టేందుకు ఛాన్స్ ఉంటుంది. అదే జరిగితే వివేకానంద రెడ్డి హత్య కేసులో ఒక్క కడప ఎంపీ అవినాష్ రెడ్డి ఉన్నారా? లేకుంటే ఆ పై స్థానాల్లో ఉన్నవారు ఉన్నారా? అనేది బయటకు రానుంది. అయితే ఏ క్షణం అయినా నాంపల్లి సిబిఐ కోర్టు.. వివేకానంద రెడ్డి హత్య కేసు విచారణకు సంబంధించి సంచలన ఆదేశాలు ఇచ్చే అవకాశం

# మూసీ ప్రక్షాళనకు అడగడుగునా అడ్డంకులు



**నల్గొండ,తెలంగాణ దిశ :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద ప్రాజెక్టుల్లో ఒకటైన మూసీ ప్రాజెక్ట్ ఆధునీకరణకు నోచుకోక అంధకారంలో కొట్టుమిట్టాడుతుంది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్న చందంగా మూసీ ప్రాజెక్టు పరిస్థితి ఉంది. సోలిపేట గ్రామం వద్ద మూసీనదిపై 1954 సంవత్సరంలో ప్రాజెక్టు నిర్మాణం చేపట్టి 1963 సంవత్సరంలో పూర్తి చేశారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయిన ఐదేళ్ల వరకు ఎడమ కాలువ 41 కిలోమీ టర్లు, కుడికాలువ 38 కిలోమీటర్ల పొడవున మొత్తం 42 గ్రామాల రైతులకు సాగునీరందించింది.ప్రస్తుతం ప్రాజెక్టులో పూడిక పెరిగిపోవడంతో 30 వేల ఎకరాలకు ఆయకట్టుకు పడిపోయింది. పాలకులు మారుతున్న మూసీ ప్రాజెక్టు పై నిర్లక్ష్యం మాత్రంవీడటం లేదు. ప్రాజెక్టు మీద నిర్మించిన రక్షణ గోడలకు రక్షణ లేకుండా పోయింది.. వెదురు కర్రలేదిక్కయ్యాయి. పర్యాటకులతో, అతిధులతో కిటకిటాడాల్సిన అతిథిగృహం శిధిలావస్థలో ఉంది. క్లస్టర్ గేట్ల నుండి ,ప్రాజెక్టు రక్షణ గోడల నుండి నుండి నీరు లీకేజ్ అవుతున్న పట్టించుకునే వారే కరువయ్యారు.ప్రాజెక్టుపై ఆరుగురు పర్మనెంట్ ఉద్యోగులు, నలుగురు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వం ప్రతి సంవత్సరం కేటాయించే నిధులు సరిపోక మరమ్మతులు పూర్తి స్థాయిలో జరగటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉమ్మడి జిల్లా మంత్రులు మూసీ ప్రాజెక్టు పై ప్రత్యేక దృష్టి పెట్టి ఆధునీకరణకు పూనుకొని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని స్థానికులు కోరుతున్నారుమూసి ప్రాజెక్ట్ 6700 ఎకరాలలో విస్తరించి ఉంది 4.46 టీఎంసీల సామర్థ్యంతో ఉన్న ప్రాజెక్ట్ రోజురోజుకు పూడిక పెరగడంతో సామర్థ్య స్థాయి తగ్గిపోతుంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల పరిధిలో నకిరేకల్, సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడెం నియోజకవర్గాలకు సాగునీరు అందుతుంది.కుడి కాల్వ పరిధిలో కేతేపల్లి, మాడ్గులపల్లి, తిప్పర్తి, వేములపల్లి మండలాల్లో 23 చెరువులు, ఎడమ కాలువ పరిధిలో సూర్యాపేట, చివ్వెంల, పెన్ పహాడ్ మండలాల్లో 22 చెరువులు ఉన్నాయి. కాలువలకు నీటిని విడుదల చేసి నట్లయితే చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండుతాయి. కుడి, ఎడమ కాల్వల కు నీటిని విడుదల చేస్తే ఆయకట్టు పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 30వేల ఎకరాల భూము లు సాగులోకి రానున్నాయి. ప్రాజెక్టు మీద ఇరువైపులా నిర్మించిన రక్షణ గోడలు శిథిలవస్థకు చేరాయి. రక్షణ గోడలకు మరమ్మత్తులు చేపట్టలేదు. రక్షణ గోడలు శిథిలమైన స్థానంలో కర్రలు కట్టి మమ అనిపించారు. ప్రాజెక్టు కు సందర్శకులు వచ్చినప్పుడు వారు ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్న వెదురు కర్రలు విరిగే ప్రమాదం ఉంది. మూసీ ప్రాజెక్టుకు 30 స్కవర్, క్రష్, రెగ్యులేటర్ గేట్లు ఉన్నాయి. వీటిలో 10 స్కవర్ గేట్లను శాశ్వతంగా మూసివేశారు. ఎనిమిది క్రష్ గేట్లలో మూడు గేట్ల నుండి నీరు లీకేజీ రూపంలో వాగులోకి వెళ్తుంది. దశాబ్దన్నర కాలంగా గేట్ల నుంచి నీరు లీకేజి అవుతున్న మరమ్మతులకు నోచుకోలేదు. మూసీ ప్రాజెక్టు డ్యాం గేట్లు ముగిసిన తర్వాత ఉన్న ప్రాంతంలో డ్యాం గోడల నుంచి సైతం నీరు లీకేజీల రూపంలో ప్రవహిస్తుంది. ఈ లీకేజీలు సంవత్సరాల తరబడి అవుతున్న పట్టించుకోవడం లేదు. లీకేజీల వెంబడి చెట్లు పెరిగి ఆ గోడను మరింత బలహీన పరుస్తున్న పరిస్థితి ఉంది.గతంలో పర్యాటకులు, అతిధులతో కలకలలాడిన అతిథి గృహం నేడు వెలవెలబోతుంది. అతిథి గృహానికి మరమ్మత్తులు లేక శిధిలవస్థకు చేరుతుంది. అతిథి గృహం, గేట్లకు కలర్స్, ఇతర మరమ్మతుల కోసం రూ.4 కోట్ల తో ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. డ్యాం రక్షణ, మరమ్మతుల కోసం రూ. 75 లక్షలతో ప్రభుత్వం నుండి సాంక్షన్ ఆర్డర్స్ వచ్చాయి కానీ సాంక్షన్ ఆర్డర్స్ వచ్చిన టెండర్లకు ఎవరు ముందుకు రాలేదని త్వరలో మళ్లీ టెండర్ వేసి మరమ్మతులు చేపడతామని ప్రాజెక్టు డి ఈ చంద్రశేఖర్ తెలిపారు. పాజెక్టును పర్యటకేంద్రంగా అభివృద్ధి చేయడానికి అన్ని వసతులు ఉన్నాయి. ఆహ్లాదకర వాతావరణం, పర్యాటకుల సందడి, హైదరాబాద్ విజయవాడ జాతీయ రహదారి, చుట్టుపక్కల ప్రకృతి అందాలు పర్యాటక కేంద్ర అభివృద్ధికి కావలసిన అన్ని అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం స్పందించి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

# తమిళనాడులో రూ.1000 కోట్ల పైగా సైబర్ మోసాలు



ఢిల్లీ:తమిళనాడులో 2025 సంవత్సరంలో ఇప్పటివరకు రూ.1,100 కోట్ల నష్టం వాటిల్లిన సైబర్ మోసాలకు సంబంధించి లక్షకు పైగా ఫిర్యాదులు నమోదయ్యాయని నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పీ) తెలిపింది. సైబర్ నేరస్థులు ఫిషింగ్ ఇమెయిల్లు, నకిలీ వెబ్‌సైట్‌లు లేదా హానికరమైన అటాచ్‌మెంట్‌లు వంటి మోసపూరిత వ్యూహాలను ఉపయోగించి ప్రజలను మోసం చేశారు. భారీ రాబడి వస్తుందని నమ్మబలికి నకిలీ ఆన్‌లైన్ లింక్‌లను క్లిక్ చేయించి భారీ స్కాములకు పాల్పడ్డారు. అందిన అనేక ఫిర్యాదులలో పెట్టుబడి స్కామ్‌లు, డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లు ఉన్నాయి. 2024లో ఎన్సీఆర్పి పోర్టల్‌లో 1,27,041 ఫిర్యాదులు నమోదయ్యాయి. అందులో 13,287 పెట్టుబడి స్కామ్‌లు కాగా, 4,439 డిజిటల్ అరెస్ట్ స్కామ్‌లుగా నివేదించబడ్డాయి. రూ. 1,673 కోట్లు నష్టపోయారని, అందులో రూ. 772 కోట్లు స్తంభింపజేసి, రూ. 84 కోట్లు బాధితులకు తిరిగి ఇచ్చామని సైబర్ క్రైమ్ అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సందీప్ మిట్టల్ తెలిపారు. ఈ సంవత్సరం జూలై వరకు రూ.1,010 కోట్ల నష్టం జరిగినట్లు నివేదించబడింది. అందులో రూ.314 కోట్లు స్తంభింప జేయబడ్డాయి. అవసరమైన కోర్టు ఆదేశాలు పొందిన తర్వాత రూ.62.4కోట్లు బాధితులకు తిరిగి ఇవ్వబడ్డాయి. తమిళనాడు సైబర్‌క్రైమ్ వింగ్ ప్రయత్నాల కారణంగా, మద్రాస్ హైకోర్టు అన్ని జ్యుడీషియల్ మేజిస్ట్రేట్‌లకు సర్క్యులర్ జారీ చేసిందని, స్తంభింప చేసినడబ్బును బాధితులకు తిరిగి ఇవ్వడానికి ఎఫ్ఐఆర్ లు నమోదు చేయమని పట్టుబట్టవద్దని ఆదేశిస్తూ మిట్టల్ చెప్పారు.

# 'తిరిగి వెళ్లిపోండి'.. బ్రిటన్‌లో భారతీయుల భవిష్యత్తు ప్రశ్నార్థకం..!



యుకె : విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, బ్రిటన్ వంటి దేశాల్లో, భారతీయులు వీసా దరఖాస్తుల ఆలస్యం, వీసా తిరస్కరణ, వీసా రద్దు, వీసా ఫార్మాలిటీల కోసం స్వదేశానికి తిరిగి వెళ్ళాల్సిన అవసరం వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా, అమెరికాలో నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాల కోసం థర్డ్ కంట్రీ వీసా ఆప్షన్ రద్దు కావడంతో, వీసా ఇంటర్వ్యూల కోసం భారతీయులు స్వదేశానికి తిరిగి వెళ్లాల్సి వస్తోంది,

ఇది వీసా ఆలస్యాలకు దారితీస్తోంది. విద్యార్థులు వీసాలు రద్దు అయినప్పుడు బహిష్కరణకు గురి కావడం లేదా చదువును కొనసాగించలేకపోవడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

బ్రిటన్ లో తిరిగి వెళ్లనివారిపై ఉక్కుపాదం: బ్రిటన్‌లో నివసిస్తున్న వేలాది మంది భారతీయుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోంది. వీసా గడువు ముగిసినప్పటికీ తమ దేశాలకు తిరిగి వెళ్లని వారిని వెనక్కి తీసుకునే విషయంలో సహకరించని దేశాలపై ఉక్కుపాదం మోపాలని యుకె ప్రభుత్వం నిర్ణయించింది. ఈ జాబితాలో భారత్, పాకిస్థాన్, నైజీరియాలు ఉండటంతో, ఆయా దేశాల పౌరులకు వీసాలు జారీ చేయడంలో కఠిన ఆంక్షలు విధించనున్నట్లు బ్రిటన్‌కు కాబోయే హోం సెక్రటరీ (లేబర్ పార్టీ షాడో హోం సెక్రటరీ) యెవెట్ కూపర్ ఉద్ఘాటించి గట్టిగా హెచ్చరించారు.

వీసా విధానమే బేరసారాల అస్త్రంగా: అక్రమ వలసదారులను నియంత్రించడంలో భాగంగా బ్రిటన్ ప్రభుత్వం 'రిటర్న్స్' ఒప్పందాలను (తిరిగి పంపించే ఒప్పందాలు) కఠినంగా అమలు చేయాలని భావిస్తోంది. ఈ ఒప్పందాల ప్రకారం %ా% వీసా గడువు ముగిసినా లేదా చట్టవిరుద్ధంగా దేశంలోకి ప్రవేశించిన తమ పౌరులను ఆయా దేశాలు తిరిగి వెనక్కి తీసుకోవాలి. అయితే, ఈ ప్రక్రియలో కొన్ని దేశాలు సహకరించడం లేదని బ్రిటన్ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో వీసా విధానాన్ని ఒక 'బేరసారాల అస్త్రంగా' వాడుకోవాలని కొత్త ప్రభుత్వం ఆలోచిస్తోంది.

ఆలస్యం చేస్తే : ఒకవేళ భారత్ వంటి దేశాలు తమ పౌరులను వెనక్కి తీసుకోవడంలో ఆలస్యం చేస్తే ముందుగా వీసా దరఖాస్తు రుసుములను భారీగా పెంచాలని, వీసా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయాలని, చివరి అస్త్రంగా ఆ దేశ పౌరులకు తాత్కాలికంగా లేదా పూర్తిగా వీసాలను నిలిపివేయాలని బ్రిటన్ ఆలోచిస్తోంది.

అత్యధికులు భారతీయులే: బ్రిటన్ హోం ఆఫీస్ గణాంకాల ప్రకారం %ా%. వీసా గడువు ముగిసినా బ్రిటన్ దేశంలోనే ఉండిపోయినవారిలో భారతీయులే అత్యధిక సంఖ్యలో ఉన్నారు. 2020 నాటికే దాదాపు 20,706 మంది భారతీయులు ఈ జాబితాలో ఉన్నట్లు అంచనా. గత ఏడాది భారత్ సుమారు 7,400 మందిని వెనక్కి తీసుకున్నప్పటికీ, పాస్‌పోర్టులు లేనివారిని గుర్తించి, వారికి అత్యవసర ప్రయాణ పత్రాలు జారీ చేయడంలో భారత ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని యూకే అధికారులు ఆరోపిస్తున్నారు. బ్రిటన్ ఏకపక్షంగా తీసుకునే ఈ నిర్ణయం భారత్ వంటి కీలక భాగస్వామ్య దేశంతో ద్వైపాక్షిక సంబంధాలను తీవ్రంగా దెబ్బతీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీకి చెందిన మైగ్రేషన్ అబ్జర్వేటరీ నిపుణుడు డాక్టర్ పీటర్ వాల్ష్ మాట్లాడుతూ %ా% " యూకే వీసా వ్యవస్థను అత్యధికంగా వినియోగించుకుంటున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇలాంటి బెదిరింపు ధోరణిని భారత్ తేలిగ్గా తీసుకోదు. ఇది ఇరు దేశాల మధ్య వాణిజ్య, విద్యా సంబంధాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది " అని అభిప్రాయపడ్డారు.

కఠిన చర్యలకు వెనుకాడబోం : బ్రిటన్ అయితేబ్రిటన్ మాత్రం ఈ సమస్యను పరిష్కరించడానికి ఎలాంటి కఠిన చర్యలకైనా వెనుకాడబోమని, అవసరమైతే ఏ దేశానికైనా వీసాలను ఆయుధంగా ప్రయోగించడానికి సిద్ధమని యెవెట్ కూపర్ స్పష్టం చేశారు. దీంతో బ్రిటన్‌లో చదువు, ఉద్యోగాల కోసం వెళ్లాలను కుంటున్న లక్షలాది మంది భారతీయుల్లో ఆందోళన నెలకొంది.

# ఎంపీనే బురిడి కొట్టించారు!

**కాకినాడ,తెలంగాణ దిశ :** ఏపీలో సైబర్ నేరాలకుఅడ్డూ అదుపూ లేకుండా పోతోంది. అనునిత్యం ఎక్కడో ఒకచోట సైబర్ నేరం నమోదు అవుతూ వస్తోంది. సామాన్యుల నుంచి ప్రముఖుల వరకు అందరూ సైబర్ నేరాల బాధితులే. పోలీసులు అనేక రూపాల్లో అవగాహన కల్పిస్తున్నా ప్రజల్లో చలనం లేదు. సైబర్ నేరాల బారిన పడుతూనే ఉన్నారు. మొన్నటికీ మొన్న ఏపీ మంత్రి అల్లుడు ఒకరు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడ్డారు. లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. ఇప్పుడు తాజాగా కాకినాడ జనసేన ఎంపి తంగేళ్ల ఉదయ శ్రీనివాస్ పేరుతో సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. ఏకంగా రూ.92.5 లక్షలు కొల్లగొట్టారు. వాట్సాప్ ప్రొఫైల్ పిక్చర్ మార్చి ఈ ఘటనకు పాల్పడ్డారు. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి.పూ ర్వాశ్రమంలో తంగేళ్ల ఉదయ శ్రీనివాస్( టీ టైమ్ వ్యవస్థాపకుడు. మొన్నటి ఎన్నికల్లో కాకినాడ నుంచి జనసేన తరఫున పోటీ చేసి గెలిచారు. అయితే తాజాగా ఈ టైం సిఎఫ్ఓ శ్రీనివాసరావు గంగిశెట్టి కి ఓ సైబర్ మోసగాడు వాట్సాప్ లో కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్ ప్రొఫైల్ పిక్చర్ పెట్టుకుని మెసేజ్ చేశాడు. మొదట ఆగస్టు 22న శ్రీనివాసరావుకు మెసేజ్ పంపాడు. అది తన కొత్త నెంబర్ అని పరిచయం చేసుకున్నాడు. అయితే అది తన బాస్ ఉదయ శ్రీనివాస్ నెంబర్ అని శ్రీనివాస్ నమ్మాడు. ఈ క్రమంలో ఆ సైబర్ మోసగాడు ఎంపీ ఉదయ శ్రీనివాస్ పేరు చెప్పి అత్యవసరంగా డబ్బులు కావాలన్నాడు. కొన్ని వారాలపాటు శ్రీనివాసరావు తో వందర్లా బ్యాంక్ అకౌంట్లకు డబ్బులు పంపమని చెప్పాడు. శ్రీనివాసరావు కూడా తన యజమాని డబ్బులు పంపమని భావించి.. 11 సార్లు ఏకంగా రూ.92.5 లక్షలు అదేవిధంగా ట్రాన్స్ఫర్ చేశారు. అయితే సెప్టెంబర్ 8న ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాసులు సిఎఫ్ఓ శ్రీనివాసరావు కలుసుకోవడంతో అసలు విషయం బయటపడింది. అటువంటి రిక్వెస్ట్ తానేది ఫోన్లో చేయలేదని ఎంపీ చెప్పడంతో సైబర్ మోసానికి గురయ్యానని శ్రీనివాసరావు ఒక నిర్ణయానికి వచ్చారు.

వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. హైదరాబాదులోని సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎంపీ పేరుతో ఈ మోసం జరగడంతో పోలీసులు సీరియస్ గా తీసుకున్నారు. అయితే ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఇప్పటివరకు ఏడు లక్షల రూపాయలను మాత్రమే ఫ్రీజ్ చేయగలిగారు. మిగిలిన డబ్బును వెనక్కి తీసుకురావడానికి పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ డబ్బులు ఎవరి బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయో తెలుసుకునేందుకు బ్యాంక్ రికార్డులు, కాల్ డేటా రికార్డులు, ఐపీ అడ్రస్లను పరిశీలిస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు. సాక్షాత్తు ఒక ఎంపీకి పరిస్థితి వచ్చిందంటే.. సామాన్యుడి దుస్థితి ఏంటన్న ప్రశ్న వినిపిస్తోంది.


# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

**కమాన్ పూర్,తెలంగాణ దిశ :** రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో గల కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థిని విద్యార్థులు సెంటినరీ కాలనిలోని జోన్-2 ఏరియాలో గల క్వార్టర్స్ లో ప్రతి ఇంటింటికీ వెళ్ళి పరిసరాల పరిశుభ్రత గురించి వారికి వివరించి, పరిసరాలలో అపరిశుభ్రం గా ఉండటం వలన ఈగలు, దోమల సంఖ్య పెరిగి వైరల్ ఫివర్స్ రావడం జరుగుతుందని, దీని వల్ల అందరూ అనారోగ్యం నకు గురికావడం జరుగుతుందని, అలా జరగకుండా ఉండాలంటే పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వారికి వివరించడం జరిగింది. అదేవిధంగా నాగేపల్లి చౌరస్తాలో ప్రతి దుకాణం లోకి వెళ్లి దుకాణ యజమానికి మరియు వినియోగదారులకు ప్లాస్టిక్ వినియోగం వలన జరిగే అనర్థాలను వివరించి, ప్లాస్టిక్ వాడడం వలన మన దేశం లో రోజు రోజుకు చాలా మంది క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. నాగేపల్లి చౌరస్తా లో వినియోగదారు లందరికీ నృత్య రూపంలో మరియు పాటల రూపంలో అందరికీ అర్థమయ్యేలా ప్లాస్టిక్ వాడకం ను తగ్గించి, బట్ట సంచులను వాడాలని తెలియ జేశారు. ఈ కార్యక్రమంలో ప్లాస్టిక్ భూతం వేషధారణలో ఉన్న అబ్బాయి రిత్విక్ ప్రత్యేక ఆకర్షణ గా నిలిచాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చందుపట్లతిరుపతి రెడ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు మరియు విద్యార్థిని,విద్యార్థులు పాల్గొన్నారు.


# సినిమా..

## పెళ్లి ఎప్పుడో చెప్పిన జాన్వీ కపూర్..!

అలనాటి అందాల తార శ్రీదేవి తనయ, బాలీవుడ్ బ్యూటీ జాహ్నవి కపూర్ ఎట్టకేలకు తన వ్యక్తిగత జీవితంపై వస్తున్న ఊహాగానాలపై స్పందించిదింది. శిఖర్‌పహారియాతో పెళ్లి వార్తలు తెగహల్‌చల్ చేస్తున్న వేళ.. ఈ వార్తలన్నింటికి చెక్ పెట్టింది. పెళ్లికి ఇంకా సమయం ఉందని.. ప్రస్తుతం తన దృష్టి అంతా నటనపైనే ఉందని స్పష్టం చేసింది. ఇటీవల ముంబయిలో జరిగిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' ట్రైలర్ లాంచ్ ఈవెంట్ సందర్భంగా జాన్వీ మీడియాతో మాట్లాడింది. ఈ సందర్భంగా 'మీ పెళ్లి ఎప్పుడు ' అనే ప్రశ్న ఎదురైంది. దీనికి జాన్వీ స్పందిస్తూ.. 'ఇప్పుడంతా నా కెరీర్ మీదే ఫోకస్ ఉంది. పెళ్లికి సమయం ఉంది' అంటూ బదులిచ్చింది. అయితే,శిఖర్ పహారియాతో జాన్వీ రిలేషన్‌లో ఉన్నట్లుగా గతకొంత కాలంగా వార్తలు వస్తున్నాయి. మహారాష్ట్ర మాజీ సీఎం సుశీల్ కుమార్ షిండే మనవడు శిఖర్‌తో జాన్వీ పలు ఈవెంట్లకు కలిసి రావడం, ఆమెఫోన్ స్పీడ్ డయల్‌లో శిఖర్ పేరు ఉండడం, 'శిఖు' పేరుతో ఉన్న నెక్లెస్ ఆమె ధరించడంతో ప్రస్తుతం ఇద్దరు రిలేషన్‌లో ఉన్నారని.. త్వరలోనే పెళ్లి చేసుకోనున్నారని వార్తలు వచ్చాయి. ఈ తాజా ఈవెంట్‌లో శిఖర్ పేరును ప్రస్తావించకపోయినా.. పెళ్లి వార్తలపై జాన్వీఓక్లియర్ స్టేట్‌మెంట్ ఇవ్వడం ఇదే తొలిసారి. ఇక జాన్వీ సినిమాల విషయానికి వస్తే శశాంక్ ఖైతాన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' సినిమాలో జాన్వీ వరుణ్‌ధావన్‌తో కలిసి నటిస్తున్నది. ఈ సినిమా అక్టోబర్2న థియేటర్లలో విడుదల కానుంది. అలాగే, గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ తోతెలుగులో 'పెద్ది' సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే.



## మృణాల్ బ్యూటీ సీక్రెట్ ఇదే..!



'సీతారామం'తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి మృణాల్ ఠాకూర్. అభినయంతో పాటు సహజ సౌందర్యంతో ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నది. చాలామంది బయటకు వచ్చిన సందర్భాల్లో మేకప్ లుక్‌లో కనిపిస్తుంటారు. కానీ, వారికి భిన్నంగా మృణాల్ మాత్రం నేచురల్‌గానే కనిపిస్తుంది. ఈ బ్యూటీ చర్మం ఎప్పుడూ కాంతివంతంగానే మెరుస్తూ ఉంటుంది. అయితే, తన బ్యూటీ సీక్రెట్‌ను సోషల్ మీడియా వేదికగా అభిమానులతో షేర్ చేసుకుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను షేర్ చేసింది. ఈ వీడియోలో మృణాల్ తాను రాత్రి పడుకునే ముందు ముఖానికి ఓ ఆయిల్‌ను అప్లయ్ చేసుకుంటానని చెప్పింది. ఆ ఆయిల్ వాడటాన్ని తన తల్లి సలహాతోనే ప్రారంభించానని చెప్పింది. అదే విషయాన్ని తల్లిని అడిగి మరింత వివరించాలన కోరింది. ఇంతకీ ఆ నూనే ఖరీదైన దేమీ కాదు. అందరూ వినియోగించే బాదం నూనే అని చెప్పింది. తన తల్లి సూచించిన ఈ చిట్కా తన చర్మానికి విశేషమైన కాంతిని ఇస్తుందని మృణాల్ చెప్పుకొచ్చింది. బాదం నూనెలో విటమిన్-ఈ, ఒమేగా ఫ్యాటీ యాసిడ్లు, ప్రొటీన్లు, ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది సహజ మాయిశ్చరైజర్‌లా పని చేస్తుంది. అంతేకాక, యాంటీ-ఏజింగ్ లక్షణాలు ఉండటం వల్ల చర్మం యువకంగా కనిపించడానికి తోడ్పడుతుంది. వయస్సు ప్రభావాలు తొందరగా కనిపించకుండా అడ్డుకుంటుంది. ఇక కళ్ల కింద కనిపించే నలుపు వలయాలు, చర్మం ఉబ్బినట్లు కనిపించే సమస్యలకు కూడా బాదం నూనె సమర్థంగా పని చేస్తుంది. ఆ భాగంలో మృదువుగా మసాజ్ చేయడం వల్ల మంచి ఫలితాలు కనిపిస్తాయని సౌందర్య నిపుణులు సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా.. మృణాల్ ఖరీదైన కొనుగోలు చేయడం ఏమాత్రం నచ్చదట. ఖరీదైన బట్టలు కొనుగోలు చేసినా వాటితో ఎలాంటి ఉపయోగం లేకుండా దాచి ఉంచాల్సి వస్తుందని అభిప్రాయపడింది.

ఇప్పటి వరకు తాను కొనుగోలు చేసిన ఖరీదైన డ్రెస్ రూ.2వేలు మాత్రమేనని ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పింది. స్టార్ హీరోయిన్ అయినా తక్కువ ధరల్లోనే డ్రెస్‌లు కొనుగోలు చేస్తానని చెప్పడంతో అందరూ షాక్ అవుతున్నారు. మృణాల్ ఠాకూర్ మూవీ ఈవెంట్స్, ఇతర ఫంక్షన్లకు హాజరైన సందర్భంలోనే ఖరీదైన వస్త్రాలను ధరిస్తుండగా.. వాటిని రెంట్ తీసుకొని ధరిస్తుందట.

భారీ ధర దుస్తులను కొనుగోలు చేయడం నచ్చదని.. బదులుగా ఆ డబ్బులను ఫుడ్, ప్రాపర్టీస్ కొనుగోలు చేసేందుకు ఖర్చు చేస్తానని చెప్పడం విశేషం. మృణాల్ వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. మృణాల్ మరాఠి కుటుంబంలో పుట్టి పెరిగింది. 2012 ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది. కెరియర్ ప్రారంభంలో టీవీల్లో నటించింది.

## ఓవర్ నైట్ స్టార్ గా తేజ...

తేజ సజ్జ హీరో గా నటించిన 'మిరాయ్' చిత్రం రీసెంట్ గానే భారీ అంచనాల నడుమ విడుదలై బాక్స్ ఆఫీస్ వద్ద అద్భుతాలను నెలకొల్పుతూ ముందుకు దూసుకుపోతుంది. నిర్మాతలు చెప్తున్నా లెక్కల ప్రకారం ఈ సినిమాకు రెండు రోజుల్లో వరల్డ్ వైడ్ గా 55 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లు వచ్చాయి. సాధారణంగా ఏ సినిమా నిర్మాత అయినా వచ్చిన డబ్బులకంటే ఎక్కువ డబ్బులు వచ్చినట్టుగా పోస్టర్స్ లో వేసి చూపిస్తుంటారు. కానీ మిరాయ్ నిర్మాతలు అలా చేయడం లేదు.ఎంత కలెక్షన్స్ అయితే వచ్చాయో, అంతే పోస్టర్స్ లో వేసే ప్రయత్నం చేశారు. 55 కోట్ల రూపాయిల గ్రాస్ అని చెప్పారు కానీ, ట్రేడ్ విశ్లేషకులు అందిస్తున్న లెక్కల ప్రకారం చూస్తే ఈ చిత్రానికి రెండు రోజుల్లో వచ్చింది 53 కోట్ల రూపాయిలు మాత్రమే. కానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రం మొదటిరోజు కంటే ఎక్కువ వసూళ్లు వచ్చాయని అంటున్నారు.ట్రేడ్ పండితులు అందిస్తున్న సమాచారం ప్రకారం ఈ చిత్రానికి రెండవ రోజున 8 కోట్ల 20 లక్షల రూపాయిల షేర్ వసూళ్లు వచ్చాయట. ఈ ఏడాది భారీ అంచనాల నడుమ విడుదలైన రామ్ చరణ్ గేమ్ చేంజర్, పవన్ కళ్యాణ్ 'హరి హర వీరమల్లు' చిత్రాలకు కూడా ఈ రేంజ్ షేర్ వసూళ్లు రాకపోవడం గమనార్హం. మూడవ రోజు అయితే రెండవ రోజు కంటే అద్భుతమైన ఆక్యుపెన్సీలు నమోదు అవుతున్నాయట. ప్రస్తుతం ఉన్న ట్రెండ్ ప్రకారం చూస్తే ఈ చిత్రం కచ్చితంగా రెండవ రోజు కంటే ఎక్కువ వసూళ్లను రాబట్టే అవకాశం ఉందని అంటున్నారు. హిందీ లో కూడా రెండవ రోజున ఈ చిత్రానికి 3 కోట్ల 50 లక్షల రూపాయిల నెట్ వసూళ్లను రాబట్టింది.



గ్రాస్ వసూళ్లు దాదాపుగా 5 కోట్ల రూపాయిల వరకు ఉండొచ్చు. ఓవర్సీస్‌లో కూడా రెండవ రోజున ఈచిత్రం హాఫ్ మిలియన్ డాలర్ల గ్రాస్ వసూళ్లను రాబట్టినట్టు సమాచారం.ఓవరాల్ గా చూస్తే రెండవ రోజున ఈచిత్రానికి 27కోట్ల రూపాయిల వరకు గ్రాస్ వసూళ్లు వచ్చాయని అంటున్నారు. 30కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు వస్తాయట. అలా ఓవరాల్ గా ఈ చిత్రం మూడు రోజుల్లో 85 కోట్ల రూపాయలకు పైగాగ్రాస్ వసూళ్లను రాబట్టే సూచనలు కనిపిస్తున్నాయని, బ్రేక్ ఈవెన్ మార్కుని కూడా అవలీల గా దాటిందని అంటున్నారు.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215